
POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
మార్చి 2025
వెల - ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 42 సంచిక: 11



# లీలా కళ్యాణ స్వర్ణోత్సవ వేడుకలు

04 - 09, మార్చి 2025



పశవోమేకామస్స మృధ్యతామ్......



యజ్ఞోమేకామస్స మృధ్యతామ్.....

అంటూ జగత్ కళ్యాణం కోసం గురు దంపతులు తలంబ్రాలను ధరిస్తున్న దృశ్యం

# శ్రీ సాయి అద్భుత సన్నిధే సకల సమస్యలకు తావులేని వ్యవస్థ

***పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ***

మానవునికి జన్మించినది మొదలు మరణించే వరకూ ఈ మధ్య కాలంలో ఎన్ని బాధలో! ముఖ్యంగా తన ఆప్తుల రోగ మరణాదులూ – ఒక్కోసారి తిండికీ, గుడ్డకూ నోచుకోని దారిద్ర్యము – ఇవి భరించలేని బాధలు. జీవితంలో అనేక కష్టాలు ఎదురవుతాయి.

అన్నిటికంటే భరింపలేనిది బాధ దుఃఖం. ఈ మహా మాయా ప్రపంచంలో బ్రతుకుతున్న మనకు ఎప్పుడో ఎందుకో తెలీని ఉపద్రవం హఠాత్తుగా మీదకు వచ్చి పడుతుంది– ఏదో మాయరోగం పట్టుకొని వేధిస్తుంది. ఎన్ని వైద్యాలు చేయించినా తగ్గదు. ఎన్ని సిస్టమ్స్ మార్చినా ఓ పట్టాన మందులవల్ల ఉపశమనం వుండదు. ఎలా ఆ స్థితి నుండి బయటపడడం? ఆ స్థితికంటే మరణమే మేలనిపిస్తుంది. మరణించడం మాత్రం మన చేతుల్లో వుందా ఏమన్నానా? ఇక ఇప్పుడెలా మార్గం? భరింపరాని బాధనుండి, తపననుండి విముక్తి ఎలా? ఈ బాధను ఎవరు తీరుస్తారు?

కుటుంబం – భార్య, పిల్లలు అంతా వున్నారు. డబ్బు కేమీ కొదువలేదు. ఏవో కల్లోలాలు వచ్చాయి హఠాత్తుగా తన కత్యంత ప్రీతిపాత్రుడైన బిడ్డ కన్ను మూశాడు. ఆ తల్లీ తండ్రీ దుఃఖం వర్ణనాతీతం. కడుపు లోంచి పెనవేసుకు వచ్చే ఉద్వేగం ఈ దుఃఖం తెచ్చి పెట్టిందెవరు? ఈ దుఃఖం వైద్యుల వల్ల తీరేదా? మిత్రుల వల్ల తీరేదా?

సమాజంలోని అశాంతికి, అసంతృప్తికి చిహ్నం 'నేరం', సమాజంలోని దుఃఖానికీ, బాధకూ చిహ్నాలు మందులు. సమాజంలోని కష్టాలకు చిహ్నాలు అప్పులు. జైళ్ళలోనూ, అసుపత్రులలోనూ కిక్కిరిసిన ప్రజానీకాన్ని



చూస్తే తెలుస్తుంది. ఎంతటి అసంతృప్తి ఎంతటి దుఃఖం వున్నాయో. ఈ రోగాల మందులబారినుండీ, ఈ కష్ట నష్టాల బారినుండీ, ఈ అప్పుల – దారిద్ర్యాలనుండీ ఇంకా అనేక అధిదైవిక, అధిభౌతిక, ఆధ్యాత్మిక తాపాలనుండి బయటపడడం ఎలా? ఎలా? ఈ సమస్యల విష ప్రపంచంలో రక్షణ కోసం ఎటు పరిగెత్తాలి? ఎవరు ఆదుకుంటారు? ఎవరు తీరుస్తారు?!

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:42 మార్చ్ - 2025 సంచిక:11

*పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"*

పూజ్య గురు దంపతుల కళ్యాణ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా ఈ సంచిక ప్రత్యేక సంచికగా వెలువడింది. కావున స్థలాభావము వల్ల ఈ సంచికలో ధారావాహికలు ప్రచురించబడలేదు. వచ్చే నెల నుండి యథావిధిగా కొనసాగించబడతాయి. - ఎడిటర్

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | శ్రీ సాయి అద్భుత సన్నిధే సకల సమస్యలకు తావులేని వ్యవస్థ | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | జగత్కళ్యాణం | శ్రీమతి అడిదం వేదవతి | 06 |
| 03. | సాధన | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 08 |
| 04. | ఆచార్యులు | శ్రీమతి అడిదం వేదవతి | 13 |
| 05. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి భవాని | 16 |
| 06. | లోక కళ్యాణ ఘడియ! | శ్రీమతి అడిదం వేదవతి | 18 |
| 07. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 20 |
| 08. | మాతృదేవి సన్నిధిలో బ్రహ్మానుభూతి మహోత్సవము! | శ్రీమతి టి. పద్మావతి | 22 |
| 09. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీమతి బిక్షాల ఓబులేశ్వరి | 24 |
| 10. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీమతి రాజేశ్వరి | 27 |


చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
www.saibharadwaja.org

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

మానవాళిని పట్టి వేధిస్తున్న అశాంతి, దుఃఖమయ మూల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేదే ఆధ్యాత్మికత! అనేకమంది ఋషులు, అనేక మతాలకు మూల పురుషులైన ప్రవక్తలు ప్రవచించిన దుఃఖ విముక్తికి మార్గమే ఆధ్యాత్మికత! ఏ వర్గానికి చెందిన వారైతేనేమి? ఏ సిద్ధాంతాలు ఆచరిస్తున్న వారైతేనేమి? ఏ వ్యవస్థను నిర్మించడానికి కృషి చేస్తున్న వారైతేనేమి అందరూ కోరేది దుఃఖంనుంచీ, అశాంతి నుంచీ విముక్తే! దీనికి ఆధ్యాత్మికత ఒక్కటే దారిచూపుతుంది!

ఇలా కాదు పద్ధతి, అన్ని సమస్యలూ ఒక్కొక్కటే పరిష్కారం చేసుకుంటూ రావాలి. ఈ భూమి, సంపదా ఏ ఒక్కరిదీ కాదు. సుఖపడడానికి అందరికీ సమానావకాశా లుండాలి – సంపదనంతా సమంగా పంచుకోవాలి దీనితో దారిద్ర్యం తీరిపోతుంది అందరూ లేమి అనేది లేకుండా సుఖంగా వుండొచ్చు– అని చక్కని ఆర్థిక వ్యవస్థ ఏర్పరచారు.

అప్పుడు మాత్రం వ్యవస్థ కళ్ళుగప్పి అందరికీ చెందాల్సిన సంపదను అక్రమముగా సొంతం చేసుకునే వారి బుద్ధులు ఎవరు మార్చగలరు? శ్రీ రాములవారు చెప్పినట్లు, ఈ సంపదలూ, రాజ్యభోగాలూ యావత్తు నాకు కించిత్తు గూడా అనందాన్ని కలిగించడం లేదనే వారి మాటేమిటి? డబ్బుకు కొరతలేని తల్లిదండ్రులకు కొడుకు చనిపోయినపుడు కలిగే తీరని దుఃఖం బాధ ఎవరు తీర్చేది?

రోగాలు రొష్టులూ తగ్గించడానికి, మృత్యువు నెదుర్కోడానికి ఎన్నో చక్కని ఆస్పత్రుల నేర్పరచుకొన్నా, యిప్పటి మందులవల్ల లొంగని అనేక కొత్త రోగాలు, ప్రకృతి భీభత్సాల వల్ల, భోపాల్ గ్యాస్ లీకేజీ వంటి ఉపద్రవాల నించీ ఏ ఆసుపత్రులు రక్షిస్తున్నాయి?

మానవాళిని పట్టి వేధిస్తున్న సమస్యలకు పరిష్కారం ప్రజాస్వామ్యం ద్వారా మాత్రమే ఏర్పడుతుందని కొందరు, కాదు వీటికి పరిష్కారం సోషలిజంలో వుందని కొందరూ, కాదు కమ్యూనిజమే దీనికి మార్గమని కొందరూ! అసలిలా కాదు, ఈ నాన్పుడు బేరాలు అసలీ సమాజానికి పనికిరావు – అడ్డు వచ్చే వారిని మట్టుబెట్టి కొత్త సమాజం నిర్మిస్తామని మరికొందరు.

ఇట్లాకాదు – ఇప్పుడు మన మతంలో వున్న కుళ్ళును కడిగేసి అసలైన మతాన్ని ఆచరిస్తే అందరూ శాంతి సుఖాలతో వుంటారని కొందరూ! ఈ సమస్యలకు జీససే సమాధానం చెప్పారని కొందరు, మహమ్మదుల వారని మరికొందరు – నానక్ మార్గం సరియైనదని మరికొందరూ!

తమకు, ఇతరులకు సుఖశాంతులు ఏర్పరచే ప్రయత్నం చేయడానికి ఒక సిద్ధాంతాన్ని నమ్మి కృషి చేస్తున్న వ్యక్తులు 'మా మార్గం సరియైన'దంటే, 'మా మార్గం పరియైనదని', ఇతర మార్గాలన్నీ తమ లక్ష్య సాధనకు అడ్డని తలచే వారిమధ్య కక్ష్యలూ, కార్పణ్యాలూ, దౌర్జన్యాలూ – వీటి మధ్య నలిగే వారికి సమాజంలో వున్న దుఃఖానికీ, ఉన్న కష్టానికీ తోడు ఇంకొంచెం దుఃఖం కలుగుతోంది. మంచి కోసం తాపత్రయపడే వివిధ వ్యవస్థల మధ్య సామరస్యం కొరవైందనే కొత్త ఆవేదన ఒకటి సమాజాన్ని వేధిస్తోంది. అందరూ తమ, ఇతరుల దుఃఖాన్ని తొలగించాలని ప్రయత్నించేవారే! ఎంతటి చిత్త శుద్ధి, తోటి సమాజంపై ఎంతటి జాలి, కరుణ లేకపోతే అన్ని సిద్ధాంతాలను నమ్మిన వ్యక్తులూ సామాజిక సుఖశాంతుల కోసం తమ జీవితాలనే వెచ్చిస్తారు! మరి ఏ మార్గం సరియైనది? దీనికి పరిష్కారం ఎలా?

ఈసిద్ధాంతాల, మతాల, వ్యవస్థల, నిర్మాణాల, వైషమ్యాల గందరగోళాల నించీ మానవాళిని ఉద్ధరించడానికా అన్నట్లు అవతరించారు సాయి! అంధకార బంధురమైన నిద్రనుండి ఉదయాన్నే వచ్చి వెలుగులోకి పడవేసే మెలకువలాగా అవతరించారు సాయి.

60 సంవత్సరాలు మనమధ్య నివసించిన సాయి ఎప్పుడూ ప్రశాంత వదనులై, ఏ సుఖాన్నీ కోరక నిత్యతృప్తులై వుండేవారు. అంతులేని విచారంతో దిక్కుతోచక ఆయనను దర్శించినవారు సంతోషంతో తిరిగి వెళ్ళేవారు. అక్కడికి వెళ్ళిన భక్తులకు శిరిడీ సాక్షాత్తూ భూలోక వైకుంఠంలా తోచేది. అక్కడికి చేరిన తక్షణమే తమకెట్టి ఆపదా కలుగజాలదన్న ధైర్యం కలిగేది! ఆయన చెంత ఎప్పుడు కూర్చున్నా శారీరక బాధలేగాక, ప్రాపంచిక ఆందోళనలన్నీ మటుమాయమయ్యేవి. ఆయన అద్భుత సన్నిధే సకల సమస్యలకూ తావులేని వ్యవస్థ! ఆయన స్మరణ సకల చింతలనూ దూరం చేసే పరిష్కారం!! ఆయన సూక్తులు మానవాళి సమస్యలకు మార్గం చూపే సిద్ధాంతం!!! ఆయన సూక్తులనాచరించి మన హృదయాలలో ఆయనను నిరంతరం స్మరించి విశ్వమంతటా ఆయన సన్నిధిగా చేసుకుందాం! సాయి సన్నిధిలో చేరుదాం!! ●

# జగత్కల్యాణం

శ్రీమతి అడిదం వేదవతి

మార్చి 6వ తేదీ – యావత్ప్రపంచానికే విశిష్టమైన రోజు. ఆ రోజు దత్తావతార సాంప్రదాయంలోని ఒక వినూత్న అధ్యాయానికి నాంది వాక్యం అయింది. అనాదిగా వున్న దత్తావతార చరిత్రకే ఒక కొత్త మలుపు. అదేమిటంటే దత్తావతారానికి గృహస్థాశ్రమ ఆవిష్కారం ఆ రోజునే జరిగింది. ఇదివరకటి దత్తావతారాలన్నీ ఎక్కువ భాగం అవధూత సాంప్రదాయానికో, సన్యాసాశ్రమధర్మానికో, ఆజన్మబ్రహ్మచర్యానికో ప్రాధాన్యత కలిగివున్నాయి. వారి బోధలు అందరికీ వర్తించినా, వారి బాహ్య ప్రవర్తన పైన చెప్పిన సాంప్రదాయాలననుసరించే వుంది. శ్రీ పాదుడు, శ్రీగురుడు, శ్రీ మాణిక్య ప్రభు, శ్రీ స్వామి సమర్థ – వీరందరూ పై చెప్పిన సాంప్రదాయాలలో ఏదో ఒకదానికి చెందిన వారిగా పామరులైన మనకు కనిపిస్తారు.

పరిపూర్ణ దత్తావతారంగా మహాత్ములందరిచేతా కీర్తించబడిన శ్రీ సాయిబాబా కూడా ఫకీరుగా మనకు కనిపించారు. అయితే ఆయన బోధలు అందరికీ వర్తించేవి. పరిపూర్ణ మానవత్వాన్ని మన మనసులలో నెలకొల్పి, ఆపైన సద్గురువుగా పరమపదానికి చేయిపట్టి నడిపించే మార్గదర్శకాలు ఆయన బోధలు. తామరతంపరగా మొలుస్తున్న కపట గురువుల కలుషిత మత సాంప్రదాయాల బారినుండి మానవాళిని రక్షించి నిత్యసత్యుడై సద్గురువై నిలిచిన అపూర్వ దత్తావతారమే శ్రీ సాయినాథుడు. ఆయన తత్వాన్ని అర్థంచేసుకుని ఆకళింపు చేసుకోనిదే మానవాళికి ఆధ్యాత్మిక ఉన్నతి అసాధ్యమనే చెప్పాలి.

బాబా తమ సమాధి అనంతరం కూడా పరిపూర్ణ సద్గురువుగా కొనసాగుతూనే వున్నారు. అయితే ఆయనను ఆశ్రయించి సేవించడమెలా?

దానికి సమాధానమే శ్రీ అలమేలుమంగా సమేత భరద్వాజుల ఆవిర్భావం. ఆ శుభదినమే మార్చి 6వ తేదీ.

నిత్యజీవితంలోని ధర్మాధర్మాల విచక్షణ కూడా సాధ్యాసాధ్యాల గందరగోళంలో పడి క్షీణించిపోతున్న నేటి సమాజానికి ధర్మబద్ధమైన గృహస్థ జీవితమే ఆచరణను కరతలామలకంగా చూపించే అరుదైన దత్తావతరణం అది. సాయినాథుని ఎలా సేవించాలో, ఆయన బోధలను ఎలా అర్థం చేసుకోవాలో, వాటిని ఆచరణలోకి ఎలా విచక్షణతో తెచ్చుకోవాలో ఆయన జీవిత విధానాన్ని ఎలా అర్థం చేసుకుని నేటి జీవితపు పరిస్థితులకు ఎలా అన్వయించుకోవాలో అర్థం కావాలంటే పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగార్ల జీవితాల్ని తరచి చూడాల్సిందే. సాయినాథుని నుంచి సంపూర్ణ సంరక్షణ, అపారమైన కరుణ ఎలా లభిస్తుందో తెలుసుకోవాలంటే వారి జీవితాలే నిలువెత్తు ఉదాహరణ. వ్యక్తిగతంగా స్త్రీ పురుషులు వారి వారి జీవితాలను ఎలా మలచుకోవాలో, ఎలా అధ్యాత్మికత ద్వారా, సద్గురు సేవ ద్వారా పరిపూర్ణం చేసుకోవాలో, తద్వారా సమాజాన్ని చూసి భయపడే పిరికివాళ్ళలా కాక, ధైర్య సాహసాలతో జీవితాన్ని నిర్భీతిగా గడపాలో తెలియాలంటే వారి జీవిత చరిత్రలు, సన్నిహితుల అనుభవాలూ మనకు ఉపకరణాలు. మన జీవితంలో సంభవించే సంఘటనలు, పరిచయాలు, వస్తు సామగ్రి – వీటి పట్ల మన దృక్పథం ఎలా వుండాలో, మన కాలాన్ని ఎలా సద్వినియోగ పరచుకోవాలో సత్సాంగత్యాన్ని నిరంతరం ఎలా అనుష్ఠించాలో, దినచర్యంతా సాయిపరంగా మన ఇతర బాధ్యతలను విస్మరించకుండానే ఎలా మలచుకోవాలో



వారి జీవితాలనుండి నేర్చుకోవచ్చు. మన సంస్కృతి, సాంప్రదాయాల పట్ల, విద్య పట్ల, ఉపాధి పట్ల, కళల పట్ల మన అభిప్రాయాలు ఎలా వుంటే సంఘానికి శ్రేయస్కరమో, నేటి జీవితాలను యాంత్రికంగా కాక, జీవన కళతో ఎలా నడుపుకోవాలో వారి జీవితాలను చూస్తే తెలుస్తుంది. ఇలా ఏ దృక్పథంలో చూసినా వారి జీవితాలు మనకు మార్గదర్శకాలే. జీవితంలో అన్ని అంశాలూ నిరంతర ఆత్మవికాసంవైపు మానవులను నడిపించే సాధనాలుగా మలచుకోవాలనీ, అందుకు ఆధ్యాత్మిక దృక్పథం మూలమనీ, సద్గురువుని నిష్ఠ ఓరిమిలతో సేవించి తరించడమే వాటి లక్ష్యం కావాలనీ, లేకపోతే మానవుడు నిరంతరం అన్వేషించే అంతులేని శాంతి, ఆనందాలు అసాధ్యాలనీ ఈ దత్తావతారం మనకు ప్రబోధిస్తుంది.

సాయి తమను అనన్యంగా సేవించినవారిని తమంతవారుగా చేస్తామని ప్రమాణం చేశారు. దానికి నిరూపణగా తానే అమ్మగారు మాస్టరుగార్ల రూపంలో తిరిగి మనమధ్య జన్మించి ఉత్తమ శిష్యులుగా జీవించి మనకు మార్గదర్శకం అయ్యారు. తమ ప్రతిరూపాలుగా పూజ్యశ్రీ అమ్మగారిని పూజ్యశ్రీ మాస్టరుగారిని మన మధ్య నిలిపారు. మాస్టరుగారు సమాధి చెందిన తర్వాత కూడా నిత్యసత్యులై తమను సేవించినవారిని రక్షిస్తూనే వున్నారు. అమ్మగారు సశరీరంగా వుంటూ తమ దగ్గరకు వచ్చే అర్తులను, అర్థార్ధులను, జిజ్ఞాసువులను ఐహికంగాను పారమార్థికంగానూ రక్షిస్తూ ఉద్ధరిస్తూ వున్నారు. సశరీరులైన సద్గురువును సేవించి తరించేందుకు మానవాళికి అవకాశమిస్తూ వున్నారు.

అమ్మగారు, మాస్టరుగారు రెండు వేరువేరు దత్తావతారాలు కారు. ఒకే దత్తావతార కార్యంలోని రెండు పార్శ్వాలు. మానవాళికి మహితవరాలు. అందుకే వారి కళ్యాణం జగత్కళ్యాణమే, దానికి కర్త, కర్తృత్వమూ శ్రీ సాయినాథుడే!!

శ్రీ సచ్చిదానంద సద్గురు అలివేలు మంగమ్మ సహిత భరద్వాజ మహరాజ్ కీ జై!

***(మార్చి 2011 పత్రిక నుండి పునర్ముద్రితము)***

(మార్చి 2012 సాయిబాబా మాసపత్రిక నుండి)

# సాధన

## పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

దేనినైనా సాధించడానికి చేసే ప్రయత్నాన్ని 'సాధన' అంటారు. అది మంచి కావచ్చు, చెడు కావచ్చు. లౌకికము కావచ్చు. పారమార్థికము కావచ్చు.

సాధారణంగా చాలామంది 'ముక్తి' కోసం చేసే ప్రయత్నాన్నే 'సాధన' అనుకుంటారు. కానీ లౌకికంగా గూడ ఏ పని సాధించాలన్నా కొద్దో గొప్పో సాధన అవసరం. మనం చేసే పనిని బట్టి దాని యొక్క సాధన అంత ఎక్కువగా గానీ, తక్కువగా గానీ వుంటుంది. సులభంగా గానీ, కష్టంగా గానీ వుంటుంది. లౌకికంగా గూడ గొప్ప పనులు చేసినవారంతా ఆ పనులు సాధించడానికి ఎంతో సాధన చేయవలసిందే. ఉదాహరణకు ఒక శాస్త్రవేత్త దేనినైనా నూతనమైనదానిని ఆవిష్కరింపజేయడానికి కఠోర సాధన చేయవలసిందే. అలాగే సామాజికంగా కొత్త పరిణామం తేవాలంటే ఎంతో క్లిష్టతరమైన సాధన అవసరం. ఇలా అన్ని విషయాలలోనూ తరతమ భేదాలతో సాధన చేయకుండా వుండడం సాధ్యపడదు.

అయితే ఆధ్యాత్మిక సాధన ప్రత్యేకమైనది, విశిష్టమైనది. అది మానవుని తత్త్వాన్ని గూర్చిన సాధన అవడం వల్ల అది ప్రత్యేక ఫలితాలను యిస్తుంది. భౌతికమైన వాటితో సంబంధంవున్నా, లేకపోయినా అది భౌతిక ప్రపంచానికి అతీతమైన స్థితిని కలుగజేస్తుంది. కనుక అది పూర్తి మానసికమైనది. భౌతికంగా మనం చేయలేని పనులను, లేక ఎంతో ఖర్చు, ప్రయత్నంతోగానీ చేయలేని పనులను కేవలం మానసిక శక్తి తోనే చేయగలగడం దాని విశిష్టత. అనేక రకాలైన సాధనల ద్వారా అనేక విధాలైన శక్తులను సాధించవచ్చు.

అయితే ఏ విధమైన సాధనలైనా ముక్తికోసం మాత్రమే నిర్దేశింపబడినవి. అందుకని ఆ సాధనామార్గంలో ఎంతటి అద్భుత శక్తులు వచ్చినా వాటిని లౌకిక ప్రయోజనాలకు వాడుకోకుండా సాధనలో ముందుకు సాగిపోవాలని పెద్దలు చెప్పారు.

ఏదైనా సాధించడానికి పట్టుదల కావాలి. అంటే ఏదైనా సాధించాలనుకుంటే గట్టి పట్టుదలతో కూడిన సాధన అవసరము. పట్టుదల లేనివాడు దేనినీ సాధించలేడు. కొందరు దేనినైనా సాధించాలని అనుకుంటారట గానీ దానిలో విఘ్నాలొస్తాయనే భయంతో ప్రారంభించనే ప్రారంభించరట. మరికొందరు ప్రారంభిస్తారు గానీ విఘ్నాలు కలుగగానే ఆపేస్తారట. మరి కొందరు ఎన్ని విఘ్నాలొచ్చినా భయపడక ఆ పనిని సాధించేవరకూ కొనసాగిస్తారట. వీరినే ధీరులు అంటారని పెద్దలు చెప్తారు.

బాబా తాము 12 సం॥ల పాటు కేవలం వేపాకులు మాత్రమే తీసుకుని జీవించామని చెప్పారు. దీనిని బట్టి ఆయన ఎటువంటి సాధన చేసారో మన ఊహకు అందదు.

అలాగే పూజ్యశ్రీ మాస్టరుగారు ఎన్నో కఠినతరమైన సాధనలు చేసారు. కానీ ఆయన ఎక్కడో ముక్కు మూసుకుని చేయలేదు. బుద్ధునివలె సర్వమూ త్యజించి

వెళ్ళిపోయి చేయలేదు. తానున్న చోటనే వుంటూ, ఒక ప్రక్క విద్యనభ్యసిస్తూ, మరొక ప్రక్క గృహావసరాలను చూసుకుంటూ సాధన చేసారు. పైగా తాము చేసే సాధన మరెవ్వరికీ తెలియకుండా చేసారు. ఆయన సాధన చేస్తున్నట్లే ఇంట్లో వారికి గానీ, బయటివారికి గానీ ఎవ్వరికీ తెలియదు.

"సాధన జీవితంలో ఒక భాగం అవడంగాదు. జీవితమే సాధన కావాలి" అని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పారు. అంటే మనం రోజూ ఎంతో కొంత సమయాన్ని మాత్రమే సాధనకు ఉపయోగించుకుంటాము. అంటే భగవంతుని మీద ధ్యాస నిలపడానికి ప్రయత్నిస్తుంటాము. అప్పుడు సాధన మన జీవితంలో ఒక భాగమన్నమాట. అంటే జీవితం వేరు, సాధన వేరు అని మనం భావిస్తున్నామన్నమాట.

సాధనకు ఏవేవో ఆటంకాలు వస్తున్నాయని, అందుకని సాధన ఎంతగా చేయాలనుకున్నా చేయలేకపోతున్నామని కొందరు బాధపడుతుంటారు. అంటే వారికి 'సాధన' అనే దానిమీద సరియైన అవగాహన లేనట్లేనని చెప్పుకోవాలి. 'సాధన' అనేది ఒకచోట కూర్చుని చేసుకునేది మాత్రమేననో, లేక ఎక్కడికైనా వెళ్ళి చేసుకునేది మాత్రమేననో అనుకుని దానికి ప్రత్యేక సమయం కావాలనుకోవడంవల్ల వచ్చే అవరోధం మాత్రమే అది. అందుకని ఈ పనివల్ల చేయలేకపోవడము, ఆ పరిస్థితివల్ల చేయలేకపోవడము – ఇలా ఎన్నో అవరోధాలు మనకు కనిపిస్తాయి. కానీ 'సాధన' అనేది పూర్తి మానసికమని గుర్తించాలి. 'సాధన' బాహ్యమైనది ఎప్పటికీ కాదు, మానసికమైనది మాత్రమే. అందుకని దానికి ఎట్టి అవరోధాలూ వుండవు – ఒక్కమనస్సు తప్ప. అంటే మనస్సుకు మనస్సే అవరోధమన్నమాట. కూర్చుని చేసే పూజ, జపము, ధ్యానము మొదలైనవన్నీ సాధనకు యింకా యింకా దోహదం చేయడానికి మాత్రమే ఉపయోగపడతాయి. అవి చేస్తున్నప్పుడు మనస్సు అందులో నిమగ్నమవకపోతే వ్యర్థమే అవుతాయి. కనుక మనస్సును సాధనయందు నిలపడమే ప్రధాన కర్తవ్యము.

కనుక మనస్సును సాధనయందు నిలపడానికి ఏవీ ఆటంకం కావని గుర్తించాలి. కారణం, ఏపని చేస్తున్నా – మన మనస్సు దానిపని అది చేసుకుపోతూవుంటుంది.



అందుకని మనస్సుకు పనితో సంబంధం వుండవచ్చు, లేకపోవచ్చు. కారణం పనితో సంబంధం వున్నంతవరకే, మనస్సు దానిపైన పనిచేసి, ఇతర ఆలోచనల మీదకు అప్రయత్నంగానే పరిగెత్తుతుంది. కనుక పనితో సంబంధం లేని అట్టి ఇతర ఆలోచనలకు బదులు సాధనాపరమైన, ఆలోచనల మీద పెడితే చాలు. కాని మనస్సు చిత్రమైంది. ఇతర ఆలోచనల మీదకు వద్దన్నా పరుగెత్తుతుంది. కానీ సాధనాపరమైన ఆలోచనల మీదకు మళ్ళిద్దామంటే మొరాయిస్తుంది. అందుకని సాధనయందు ప్రీతి లేని మనస్సును సాధనయందు ప్రీతి కలిగేలా చేసే ప్రయత్నమే ఈ సాధన.

అందుకని సాధన చేయడానికి భగవంతుని మీద ప్రీతి వుండాలి. అంటే భగవంతుని యొక్క – ఔదార్యాన్నీ, ఆయన మనకు చేస్తున్న శ్రేయస్సును గూర్చి ఆలోచిస్తూంటే ఆయన మీద మనకు ఇష్టం కలుగుతుంది. కనుక మనం ఆయనను గూర్చి ఎక్కువగా ఆలోచిస్తాము. ఇందుకు పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక ఉదాహరణ చెప్పేవారు : "వయస్సులో వున్న వారిరువురు ఒకరినొకరు ప్రేమించుకున్నారనుకుందాము. వారిరువురి ఆలోచనంతా నిరంతరమూ తాము ప్రేమించిన ప్రియుడి మీదనో, ప్రియురాలి మీదనో మాత్రమే తిరుగుతుంటుంది.

వీలైనంత సమయం వారితోనే ఎక్కువగా మాట్లాడాలనీ, వారితోనే గడపాలనీ చూస్తుంటారు. అందుకు అవకాశాల కోసం ప్రయత్నిస్తుంటారు. వారికి ఏ ఇతర సంభాషణలు, ఏ ఇతర వ్యాపకాలూ పట్టవు. సాధ్యమైనంత తక్కువ సమయాన్ని ఇతర విషయాల కోసం వెచ్చిస్తారు. ఏ ఇతర ఆలోచనలూ ఎక్కువగా వుండవు. తాను ప్రేమించిన వారిపై వుండే ఆలోచనలకు ఏ ఇతర ఆలోచనలూ అడ్డురావు. పైగా ఏవైనా యితరమైన వాటిని ఆలోచింపవలసి వచ్చినా, చేయవలసి వచ్చినా కోపము, చిరాకు వస్తాయి.

అట్లాగే భగవంతుని మీద ప్రేమ పెరిగిన కొద్దీ, ఇతర ఆలోచనల మీద ధ్యాస తగ్గుతూ భగవంతుని మీద పెరుగుతూ పోతుంది. అప్పుడు వీలున్నప్పుడల్లా సాధనకు కూర్చోవాలనిపిస్తుంది. కూర్చోడం జరుగుతుంది. అలా కూర్చోడానికి వీలుపడకపోతే ఏ పని చేస్తున్నా భగవంతుని మీదే ధ్యాస వుంటుంది. కనుకనే భగవద్గీతలో శ్రీకృష్ణుడు, "భక్తుడైనవాడు కూర్చున్నా, నిలుచున్నా, తింటున్నా, నడుస్తున్నా– ఇలా ఏ పని చేస్తున్నా నిరంతరమూ భగవంతుని ధ్యాసలోనే వుంటాడు" అని చెప్పాడు. ఈ విధంగా ఆలోచిస్తే సాధనకు అంతరాయమైనదేదీ కనిపించదు.

అలాగాక కొన్ని పనులు మనసు పెట్టి మాత్రమే చేయవలసి వుంటుంది. ఉదాహరణకు ఉద్యోగము, చదువు మొదలైనవి. అప్పుడెలా? అంటే పూజ్యశ్రీ మాస్టరుగారిలా చెప్పారు: "అప్పుడు పని ప్రారంభించే ముందు, మధ్యమధ్య విరామ సమయాలలోనూ, పని అయిపోయిన తర్వాత భగవంతుని స్మరించుకోవాలి. మధ్యమధ్యలో మనకు వచ్చే ఇతర అనవసరమైన ఆలోచనలకు బదులు బాబా పై ధ్యాస నిలుపుకోవాలి. పని ప్రారంభించబోయేముందు 'బాబా ఈ నా కర్తవ్యాన్ని మీరు నాకిచ్చిన మీ సేవగా భావిస్తాను. నా కర్తవ్యాన్ని సక్రమంగా, ధర్మబద్ధంగా నిర్వర్తించేలా చేయి' అని ప్రార్థించాలి. అలాగే పని ముగించేటప్పుడు గూడ బాబా స్మరణతో ముగించాలి. ఇలా చేస్తే మన సాధన అంతకంతకూ సులభతరమవుతుంది.

అంతేగాక మన సాధన వల్ల ఇతరులకెప్పుడూ ఎటువంటి ఆటంకము కలుగకూడదు. మన కర్తవ్యాన్నెప్పుడూ తప్పించుకోగూడదు. కొంతమంది తాము చేసే సాధనలో అంటే భగవంతుని స్మరణలో అందరికీ ఇబ్బంది కలిగిస్తూ వుంటారు. తాము భగవంతుని పూజలోనో, పారాయణలోనో వుంటాము, గనుక అత్యవసరమైనా సరే తమను ఇతరులు పలుకరించగూడదని, అవతలివారికి ఇబ్బంది అయినా సరే తాము కూర్చున్న చోటునుంచి తమను కదపగూడదని, ఎంత ముఖ్యమైన అవసరమైనా, తాము మాత్రమే చేయవలసిన పనులను గూడ తమకు చెప్పగూడదని, తాము మహాభక్తులము (లేక సాధకులము) గనుక తాము చేసే పనులకు ఎవ్వరూ అడ్డు చెప్పకూడదనీ ఆంక్షలు పెడతారు. అంతేగాదు, – ఇతరులు అన్నీ సకాలంలో సక్రమంగా తమకు సమకూర్చాలనీ తలుస్తారు. ఉదాహరణకు ఇంట్లోకి – అవసరమైన వస్తువులు గానీ, సరుకులుగానీ తాము తీసుకురాకపోయినప్పటికీ అవతలివారికి ఎక్కువ పనులున్నా లేక తీరిక లేకపోయినాసరే, వారే ఆ పనులను గూడ చేసి వీరికి సకాలంలో ఉపాహారము, భోజనమూ సిద్ధం చేయాలన్నమాట. ఇతరులు అందుకు అభ్యంతరం చెబితే – వారిపై విరుచుకుపడతారు. తామేదో గొప్పగా సాధన చేయాలనుకుంటుంటే అందరూ తమకు అడ్డువస్తున్నారని కోపగించుకుంటారు. ఇక్కడ ఒక విషయం మనం గమనించాలి. వారిలాగే ఇతరులుగూడ ప్రవర్తిస్తే ఎలా వుంటుందో ఆలోచిస్తే వారి ప్రవర్తన ఎంత అసమంజసమైనదో అర్థమవుతుంది.

ఇలా మన మనస్సు చిత్రవిచిత్రంగా ప్రక్కదారులు పడుతుంటుంది. వీటిని జాగ్రత్తగా గమనించుకుంటూ మన సాధనను సరియైన మార్గంలో తీసుకువెళ్తుండాలి. అంతేగాక, నిర్దుష్టంగా సాధన చేస్తున్నప్పటికీ సాధనలో కొంచెం పైకి ఎదగగానే సిద్ధులనే క్రూరమృగాల బారిన పడే ప్రమాదం పొంచి వుంటుంది. అందుకని సాధనలో అడుగడుగునా జాగ్రత్త వహిస్తూనే వుండాలి.

పూజ్యశ్రీ మాస్టరుగారు ఒకసారిలా చెప్పారు: "మన సాధనకోసం ఎవరికీ ఆంక్షలు పెట్టకూడదు. ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదు. ఎవరికీ మనవల్ల ఎటువంటి అసౌకర్యమూ, ఆటంకము కలుగకుండా చేసేదే నిజమైన సాధన. కొందరు తాము పూజ, – పారాయణ, ధ్యానము మొదలైనవి చేసుకుంటున్నప్పుడు ఇంట్లో ఎవ్వరూ పెద్దగా



మాట్లాడగూడదని, పసిపిల్లలు గూడ ఏడవగూడదనీ కోపగించుకుంటుంటారు. అంటే ఏమిటి అర్థం? ఏమాత్రం శబ్దమైనా, ఆటంకం వచ్చినా మన మనస్సు భగవంతుని మీద నిలవదన్నమాట. అంటే మన సాధన 'తుమ్మితే ఊడిపోయే ముక్కు' అన్నమాట. అటువంటి వాడికి సాధన ఏనాటికీ జరుగదు. కారణం ఇంట్లో ఎవరు ఏ శబ్దం చేసినా, ఏమి జరిగినా వీరికి వాళ్ళను కోప్పడడంతోనే సరిపోతుంది. ఇక జపధ్యానాదులెక్కడ చేస్తారు? అందరినీ ఉరిమిరిమి చూడడము, అరవడముతోనే సరిపోతుంది. చివరకు అందరినీ తిట్టుకుంటూ సాధన నుంచి లేవడమే జరుగుతుంది. అంత ఏకాంతము కావాలనుకున్నవాళ్ళు బయటకు వెళ్ళి ఏకాంత ప్రదేశములో సాధన చేసుకోవాలి. ఇటువంటి వారికి అక్కడ గూడ పక్షుల యొక్క, జంతువుల యొక్క అరుపులు ఆటంకమవుతాయి. కనుక ఎక్కడ వున్నా, ఎటువంటి పరిస్థితులలో వున్నా మన ధ్యాస భగవంతుని మీద నిలుపుకోవడానికి ప్రయత్నించాలి. అప్పుడు మన సాధనకు ఎట్టి ఆటంకాలు వుండవు. ఒకడు బాణాలు తయారు చేస్తున్నాడట. తన ముందుగా వెళ్తున్న పెద్ద ఊరేగింపుగూడ అతని గుర్తింపులోకి రాలేదుట. అలాంటి ఏకాగ్రతకు ఎప్పుడూ ప్రయత్నిస్తూనే వుండాలి. ఉదాహరణకు మనమొక నవల చదువుతున్నామనుకోండి. అప్పుడు ఇంట్లోని విషయాలేవీ మనకు ఆటంకం కావు. మరి పారాయణ చేస్తున్నప్పుడు అలా జరుగుతున్నదంటే మనకు పారాయణలో ఏకాగ్రత కుదరలేదన్నమాట. అందుకని ఏకాగ్రతకు ప్రయత్నించాలి.

కొందరు తాము సాధకులము గనుక తమ బాధ్యతలను తాము నిర్వర్తించనవసరం లేదని తలుస్తారు. సంసారంలో వున్నంతవరకూ మన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించవలసినదే. కారణం అది ధర్మం గనుక. ధర్మం తప్పిన సాధన సరియైన సాధనకాదు. సర్వమూ త్యజించి భిక్షతో మాత్రమే జీవించి సాధన చేసుకునేవారికి మాత్రమే ఏ బాధ్యతలూ వుండవు. కనుక మనం మన కర్తవ్యం నిర్వర్తిస్తూనే సాధన కొనసాగించాలి.

మరికొందరు రోజులో కొంత సమయం మాత్రమే సాధనలో గడిపి, మిగతా సమయమంతా వ్యర్థ కాలక్షేపాలతో గడుపుతూ, తామెంతో సాధన చేస్తున్నామని, మిగతా వాళ్ళు అజ్ఞానంతో కొట్టుకుపోతున్నారనీ తలుస్తుంటారు. అంటే అటువంటి వారిలో తామేదో గొప్ప అనే అహంకారం బలపడుతున్నదన్నమాట. నిజంగా సాధన చెయ్యాలనుకున్న వారెవ్వరూ తాము సాధన చేస్తున్నామని విఱ్ఱవీగరు. ఎవరికీ గొప్పగా చెప్పుకోరు. లక్ష్యం మీద దృష్టివున్నవాడికి సాధన చేస్తూ పోవడమే జరుగుతుంది గానీ అహంకరించడానికి, ఆలోచించడానికి సమయముండదు. ర్యాంకు రావాలని చదివేవాడు యింకాయింకా చదవాలనే అనుకుంటాడు గాని తాను అంతగా చదువుతున్నానని అహంకరిస్తాడా? గొప్పలు చెప్పుకుంటాడా? అలాగే ఇదీను. అసలు సాధనంతా అహంకార నిర్మూలనం కోసమే. నేను గొప్పగా సాధన చేస్తున్నాను అనుకునేవాడు లక్ష్యం మీద కన్నా తన గొప్పల మీద కోరికగలవాడన్నమాట.

అసలు సాధన ఎందుకు చేయాలి? అంత కష్టపడి సాధన చేయడం అవసరమా? ఇప్పటిలాగా హాయిగా వుండవచ్చుగదా! అని కొందరు ప్రశ్నించవచ్చు. నిజమే! అలా అనిపించబట్టే చాలామంది ఆధ్యాత్మికతవైపుకు, సాధనవైపుకూ కన్నెత్తి గూడ చూడరు. వాళ్ళకు ఆధ్యాత్మిక సాధన చేస్తే అన్నీ వదులుకోవలసి వస్తుందని భయం. అందుకే ఆమడదూరం పారిపోతుంటారు. అయితే 'హాయిగా

వుండవచ్చుగా' అని వారనుకున్నట్టు హాయిగా వుండడానికే సాధన అని వారికి తెలియదు. ఏవో కొన్ని కోరికలు, తీరినప్పుడో, కొన్ని పరిస్థితులు అనుకూలించినప్పుడో 'హాయిగా వుండడం' గాక, ఎప్పుడూ హాయిగా వుండే ప్రయత్నమే ఆధ్యాత్మిక సాధన అనివారికి తెలియదు.

అయితే ఆధ్యాత్మిక సాధన కష్టంకాదా? అంటే కష్టమేనని ఒప్పుకోక తప్పదు. కారణం ఆధ్యాత్మిక సాధన నాన్హేఘాట్ ను దున్నపోతుమీద దాటటం కంటే గూడ కష్టమని, శక్తినంతా వినియోగించి కృషి చేస్తేనేగాని సాధ్యం కాదనీ బాబానే చెప్పారు. పూజ్యశ్రీ మాస్టరుగారు గూడ యిలా అంటారు : "ఒక్క క్షణకాలం గూడ మన మనస్సును నిగ్రహించుకోవడం ఎంతో కష్టం" అని. ఆయన యింకా యిలా అంటారు : "ఆధ్యాత్మిక సాధన ఎంతో కష్టమే. అయినప్పటికీ సద్గురువును సేవిస్తే అది సులభమే అవుతుంది. అందునా సద్గురువులలో కోహినూర్ వంటివారయిన శిరిడీ సాయినాథుని సేవిస్తే యింకా సులభమవుతుంది, కారణం ఆయన ఈ సకల చరాచర జగత్తంతా తమ రూపమేనని అనుభవాలనిస్తున్నారు. అందుకే సాధకునకు ఆటంకమయ్యే ఈ ప్రపంచం సాయిభక్తుని సాధనకు దోహదకారియై అతని సాధనను సులభతరం చేస్తుంది."

ఎక్కడో ముక్కుమూసుకుని చేసే సాధనగా గాకుండా పూజ్యశ్రీ మాస్టరుగారు అంత సులభంగా సాధన ఎలా కొనసాగించవచ్చో అనేక విధాల మనకు బోధించారు. మన ఆలోచనలను సరియైన విధంగా సరిదిద్దుకుంటే మన ప్రవర్తన అదే మారిపోతుందని, మన ప్రవర్తనను సరిగా మలచుకోవడమే సాధనలో అతిముఖ్యమైన అంశమని ఆయన చెప్పేవారు. మన ఆలోచనలు, ప్రవర్తన సరిగా లేకుండా బాబాను ఏవిధంగా సేవించినా అది సరియైన సాధన కాజాలదని ఆయన చెప్పేవారు. అంతేగాక మన ప్రవర్తనను మలచుకోవడం మన చేతిలోనే వుంటుంది గనుక సాధనకు ఆటంకమేముంటుంది? అనేవారాయన.

పూజ్యశ్రీ మాస్టరుగారు యింకా యిలా చెప్పారు: "సాధనకు గమ్యమేమిటి? పరమాత్మను చేరుకోవడం. అంటే బాబాను చేరుకోవడం. అందుకు సాధన చాలా కష్టమని చాలామంది అనుకుంటారు. సాధనకు బాబా స్మరణకు మించిన సులభతరమైన సాధన మరొకటి లేదు. కారణం బాబా మనకు ఎంతో దగ్గరగా వుంటారు. పిలిస్తే పలుకుతారు. తలిస్తే మన చెంతనుంటారు. ఆయన ఎంతటి దయామయులో ఆయన లీలలను చూస్తే తెలుస్తుంది. తన దుష్కర్మను పది జన్మలలో అనుభవింపజేయమని ప్రార్థించిన భక్తుని కర్మను తక్షణమే ప్రక్షాళన చేసారు బాబా. మరొకరిని మృత్యువునుంచే కాపాడారు. ఇలా బాబా ఎన్నో లీలలు చేసారు. ఇప్పటికీ చేస్తున్నారు గూడ. ఇది ఆయనను స్మరించేవారందరికీ అనుభవమే. ఆయన మన లౌకిక కోరికలు తీరుస్తూనే తగురీతిన మన ప్రవృత్తులను గూడ సంస్కరిస్తారు. కనుక ఆయనవద్ద మనకు ఇహము, పరమూ గూడ దక్కుతాయి. దానికి మనం చేయవలసిందల్లా ఒక్కటే. ఆయన చేసిన అద్భుత లీలలను ఎప్పుడూ స్మరించుకుంటూ వుండాలి. అంతేగాక ఇతరులకు కలిగిన అనుభవాలను, మనకు కలిగిన అనుభవాలను, ఆయన శరీరంతో చేసిన అద్భుత లీలలను ఇతరులతో గూడ చెబుతూ వుండాలి. మనింట్లో పసిబిడ్డ వుంటే ఆ బిడ్డ గురించి ఎంతెంతగా చెప్పుకుంటుంటామో అలాగే బాబా లీలలను గూర్చి చెప్పుకుంటుంటే, బాబా మీద ప్రీతి యింకా యింకా పెరుగుతుంది. ఆయన పట్ల ప్రీతి పెరిగిన కొద్దీ స్మరణ పెరుగుతుంది. అలా జరగడం వల్ల ఎంతో కష్టమనిపించే సాధన సులభతరమవుతుంది. ఇతరులతో చెప్పుకొనడం వల్ల మరొక సౌలభ్యము గూడ వున్నది. వారికి గూడ సత్సంగమై వారికి గూడ బాబా స్మరణ జరుగుతుంది.

పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన వాటిని మననం చేసుకుంటూ, మన ఆలోచనలను, ప్రవర్తనను మలచుకుంటూ పోతుంటే మనకు సాధన సులభతరమవుతుందని వేరే చెప్పుకోనవసరం లేదు. కనుక ఈ కృతజ్ఞతా మహోత్సవ సందర్భంగా పైన చెప్పుకున్న బలహీనతలు మనలో వున్నాయో లేదో నిశితంగా పరిశీలించుకుని సాధనను సరియైన విధంగా చేసుకోవడానికి ప్రయత్నిద్దాము. అందుకు ఆశీస్సులందించమని పూజ్యశ్రీ మాస్టరుగారిని, శ్రీ సాయిబాబాను మనసారా ప్రార్థిద్దాము.

# ఆచార్యులు

శ్రీమతి అడిదం వేదవతి

“ఎవరు నాశిష్యులనేది? అటువంటివాడు నాకు ఒక్కడూ కనిపించలేదు!” అన్నారు సాయి. అంటే సాయి అంతటి సద్గురువు లభించినప్పటికీ ఆయనను సరైన విధంగా సేవించి తరించగల సమర్థులైన శిష్యులు ఆయనకు ఒక్కరు కూడా దొరకలేదని సాయి చెప్పారు. అటువంటి సమర్థ సద్గురువైన సాయి పూజ్యశ్రీ మాస్టరుగారు గురుచరిత్ర పారాయణ పూర్తిచేసిన రోజు రాత్రి కలలో దర్శనమిచ్చారు. పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్నంలోనే ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశారు. బాబా పూజ్యశ్రీ మాస్టరుగారిని ప్రేమతో కౌగిలించుకొన్నారు. మాస్టరుగారి వీపునూ, తలనూ ప్రేమతో నిమురుతూ, “నీకు గురువు దొరకలేదని బాధపడతావెందుకు? నేనున్నాను!” అని మూడుసార్లు చెప్పారు. ఎట్టకేలకు బాబాకు పూజ్యశ్రీ మాస్టరుగారు ఉత్తమ శిష్యులుగా లభించారన్న మాట! ఈ విషయం స్మరిస్తే గాని మాస్టరుగారి ఔన్నత్యం మనకు అర్థంకాదు.


ఉత్తమ శిష్యుడు తమ సద్గురువునే సదా స్మరిస్తూ, కీర్తిస్తూ, ఆయన ఆజ్ఞనే వేదంగా భావిస్తూ, ఆయన మార్గంలో జీవితం గడిపి, చివరకు తానే ఆయనగా మారిపోతాడు. పూజ్యశ్రీ మాస్టరుగారి విషయంలో అదే జరిగింది. అయితే సత్యాన్వేషణ రూపంలో ఆయన సాధనంతా సాగి తానే బాబా అయిన క్షణంలో అవతారకార్యంగా రూపొంది ఉత్తమ శిష్యుడనే అవతారమెత్తారాయన. ఈ విషయం మాస్టరుగారికి సమకాలీనులైన వివిధ మహాత్ముల మాటల ద్వారా ప్రకటమౌతుంది. పూజ్యశ్రీ మాస్టరుగారికి బాబా స్వప్న దర్శన మివ్వకమునుపే శ్రీ గుళవణీ మహరాజ్ ఆయనను చూడగానే, “ఓ సాయిబాబా కా బేటా” అన్నారు.

అవధూత శ్రీ చివటం అమ్మ పూజ్యశ్రీ మాస్టరుగారిని మొదటిసారి చూడగానే పరుగున వచ్చి ఆయనకు సాష్టాంగపడి నమస్కరించారు. ‘శ్రీ రామిరెడ్డి తాతగారు’ అనే గొప్ప అవధూత పూజ్యశ్రీ మాస్టరుగారు సాక్షాత్తూ దత్తాత్రేయ స్వామియని స్పష్టంగా చెప్పారు. కాళహస్తిలో నివసించిన అవధూత అయిన శ్రీ వేణుగోపాల స్వామి మాస్టరుగారు సాక్షాత్తూ భగవంతుడేనని చెప్పారు. మాలిక్ బాబా ఆయన సాక్షాత్తూ సాయినాథుడేనని చెప్పారు. ‘సుధీంద్రబాబు’ గారు అనే గొప్ప మహాత్ముడు, ‘భరద్వాజ మాస్టరుగారా! ఆయన నా దర్శనానికి రాదలచడమేమిటి? నేనే ఆయన దర్శనానికి వస్తాను. ఈ కాలానికి ఎదురీదు తున్నారాయన. ఆయన ‘ఆచార్య’ పదవికి అర్హులు!” అన్నారు ఇంకెందరో మహాత్ములు పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనానికై తపించేవారు. ఆయనపై ప్రశంసల వర్షం కురిపించేవారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు సాక్షాత్తూ దత్తాత్రేయులేననే విషయం సుస్పష్టం. అయితే దత్తస్వామి మాస్టరుగారి రూపంలో ఎందుకు అవతరించినట్లు? ‘ఆయా దేశకాల పరిస్థితులననుసరించి ధర్మస్థాపనకై దత్తస్వామి అవతరిస్తూ వుంటారు. తన ప్రభావం చేత అనేకులను సన్మార్గవర్తులనులను చేస్తారు’ అని దత్తస్వామి వృత్తాంతం తెలుపుతుంది. కనుక నేటి మన దేశకాల పరిస్థితులలోని

సమస్యలకు సమాధానంగా మాస్టరుగారు అవతరించారన్నది సుస్పష్టం. ఈనాటి మన దేశకాల పరిస్థితులలో మన జీవిత సమస్యలన్నింటికీ సమాధానంగా బాబా అవతరించారని పూజ్యశ్రీ మాస్టరుగారు స్పష్టం చేశారు. అంటే బాబా బోధలకు ఆచరణ రూపం మాస్టరుగారు. మన నిత్యజీవితంలో అడుగడుగునా మనం బాబా మార్గంలో అంటే ధర్మమార్గంలో నడవడమెలాగో తమ జీవితంలో మాస్టరుగారు ఆచరించి చూపారు. బోధించారు. ఫకీరైన బాబాలా గాక, మనలాగే సంఘంలోని ఒక బ్రహ్మచారిగా, గృహస్థుగా వుంటూనే మనం ఎదుర్కొనే ప్రపంచంలోనే తరించడమెలాగో మనకు మార్గం చూపించారు.

మాస్టరుగారి బోధలను, జీవితాన్ని, ఆయన అవతారకార్యాన్ని స్థూలంగా ఇలా చెప్పుకోవచ్చు. 'ఉన్నదానితో



అసంతృప్తి, లేనిదేనికోసమో తపన' ఇదే మానవ జీవిత సారం. ఈ అశాంతి నుంచి, అసంతృప్తి నుంచి మానవ ప్రయత్నం ప్రారంభమౌతుంది. అంతులేని తృప్తి, శాంతులు తప్పకుండా లభిస్తాయనే ఆశతో మానవుడు తన జీవితమంతా శ్రమిస్తూ, ప్రయత్నిస్తూ వుంటాడు. అంటే అతనికి అంతులేని తరగని తృప్తి, శాంతి, ఆనందాలు కలిగిన జీవితం కావాలన్నమాట! అయితే వాటిని ఎలా పొందాలో తెలియకుండా ప్రయత్నించడం వల్ల మానవునికి సామాన్యంగా శ్రమే మిగులుతుంది, ఫలితం లభించదు. అంటే తనకు కావలసిన హాయైన జీవితం లభించదు. మరి అటువంటి అంతులేని తృప్తి, శాంతులు కలిగిన జీవితం కావాలంటే ఏమి చేయాలి?

ప్రకృతిలో భాగమైన మానవుడు సృష్టి లోని ఇతర జడ జీవరాశిలాగా ప్రకృతి సూత్రాలకు లోబడి జీవిస్తే సమస్యే లేదు. అప్పుడు తృప్తి, శాంతులతో కూడిన జీవితం అతని స్వంతమౌతుంది. ఎందుకంటే తాను ప్రకృతికి విరుద్ధంగా ప్రవర్తించడు గనుక! కానీ భావస్వాతంత్ర్యం కలిగిన ఏకైక జీవి అయిన మానవుడు తాను ప్రకృతికంటే వేరనుకొంటాడు. ప్రకృతినే శాసించి తనకు అనుగుణంగా మార్చుకోచూస్తాడు. కానీ అతని దేహము, మనస్సు ప్రకృతి సూత్రాలకు లోబడి తయారైనవే, ప్రవర్తించవలసినవే. కానీ భావస్వాతంత్ర్యం కారణంచేత మానవుడు అందుకు విరుద్ధంగా ప్రవర్తించేందుకు ప్రయత్నించి తనకంటే ఎన్నోరెట్లు శక్తివంతమైన ప్రకృతి సూత్రాలననుసరించి ఫలితాలు పొందుతాడు. ప్రకృతిననుసరించి ప్రవర్తించిన విషయాలలో సుఖాన్ని, ప్రకృతికి విరుద్ధంగా ప్రవర్తించిన విషయాలలో దుఃఖాన్నీ పొందుతాడు. వీటినే పుణ్య పాపాలంటారు. వీటివల్ల అతనికి లభించేది జీవితంలో పొంగు కృంగులేగాని స్థిరమైన, అంతులేని తృప్తి, శాంతి, ఆనందాలు కావు.

మరి మనకు అంతులేని తృప్తి, శాంతి, ఆనందాలు హాయైన జీవితం కావాలంటే ఏమి చేయాలి? అలా జీవిస్తున్నవారు, జీవించినవారు ఎవరైనా వున్నారా లేదా అని అన్వేషించాలి. అటువంటివారు మనకు లభించినప్పుడు అటువంటి హాయైన జీవితం

వారికెలా సాధ్యమైందో వారినడిగి తెలుసుకొని వారి మార్గదర్శకత్వంలో శిక్షణ పొంది అటువంటి స్థితిని పొందాలి. అటువంటి వారే మహాత్ములు, సద్గురువులు, వీరంతా చెప్పినదేమిటి?

మానవుడు సంఘజీవి కనుక తన చుట్టూవున్నవారు తనకు శ్రేయస్సు కలిగిస్తూ తనతో సహజీవనం చేయాలని ఆకాంక్షిస్తాడు. అలా వుంటేనే తనకు హాయైన జీవితం లభిస్తుందని అతనికి తెలుసు. కానీ చిత్రమేమిటంటే ప్రతి ఒక్క మానవుడికీ మౌలికంగా అలానే అనిపిస్తుంది. కనుక అదే అతని అవసరం. కనుక పరస్పరం అలా శ్రేయస్సు కలిగించుకుంటూ జీవిస్తేనే హాయైన జీవితం సాధ్యం. సాటి మానవుల పట్ల మాత్రమేగాక ప్రకృతికీ– మానవునికీ కూడా ఇదే వర్తిస్తుంది. ప్రకృతికి శ్రేయస్సు కలిగిస్తూ, తాను శ్రేయస్సు పొందుతూ, సాటి మానవులకు శ్రేయస్సు కలిగిస్తూ, శ్రేయస్సు పొందుతూ వుంటేనే అంతులేని తృప్తి, శాంతులు కలిగిన జీవితం సాధ్యమన్నమాట! ఇదే సృష్టినంతటినీ పాలిస్తున్న ధర్మసూత్రం. క్షణ క్షణమూ ఈ సూత్రాన్ని ఆచరణలో పెట్టుకుంటూ వెళ్ళే జీవితాన్నే 'ధర్మబద్ధమైన జీవితం' అంటారు.

అట్టి ధర్మబద్ధమైన జీవితం గడపాలంటే మన నిత్యజీవితంలో ఎదురయ్యే ప్రతి అంశానికీ ఈ ధర్మసూత్రానికీ చక్కటి సమన్వయం రావాలి. ఏ అంశం విషయంలో ఎలా ఆలోచిస్తే, ప్రవర్తిస్తే ఈ ధర్మసూత్రం ఆచరణలోనికి వస్తుందనే విషయం పై ఒక నిర్దుష్టమైన మార్గం కావాలి. అలా ఆచరణలోకి పెట్టడానికి సహకరించే అంశాలను పెంపొందించుకొంటూ, అలా సహకరించని అంశాలను సంస్కరించుకొంటూ ముందుకు సాగేందుకు ఒక నిర్దుష్టమైన మార్గదర్శకత్వం మనకు కావాలి. మన దేశకాల పరిస్థితులలో ఈ ధర్మసూత్రాన్ని ఆచరణలో పెట్టుకునే మార్గం కావాలి. దానిని సూచించే మార్గాలే అట్టి జీవితాన్ని గడిపిన మహాత్ములందించిన వివిధ మతాలు.

ఈ ధర్మబద్ధమైన జీవితాన్ని గడిపేందుకు అవసరమైన అవగాహనను, ఆలోచనా విధానాన్ని, అందుకు సహకరించే అంశాలను పెంపొందించుకొనేందుకు, అందుకు అనుకూలంగాని అంశాలను సంస్కరించుకొనేందుకు అవసరమైన శిక్షణను, అట్టి శిక్షణను దేశకాల పరిస్థితులకు, సాంఘిక, వ్యక్తిగత దైనందిన జీవిత విధానానికీ ధర్మసూత్రానికీ అనుసంధానం చేసే ఆచారకాండను, బాహ్యాచార విధానాలను అందించేదే మతం. వివిధ దేశకాల పరిస్థితులననుసరించి వివిధ మతాలు ఉద్భవించాయి.

అయితే కాలక్రమేణా మానవజాతికి అట్టి అవగాహన లోపించడం వల్ల మతాలు పరస్పర విద్వేషాలకు కారణమయ్యాయి. మానవ జీవిత లక్ష్యం గురించి అవగాహన, స్పష్టత లోపించడం చేత మతాలవంటి ఆధ్యాత్మిక వ్యవస్థలకు, కులాల వంటి సాంఘిక వ్యవస్థలకు, ఆచార వ్యవహారాలకు, వ్యక్తిగత, సాంఘిక ఆరోగ్యాలకు మధ్య సమన్వయం లోపించి మానవ జీవితం అస్తవ్యస్తమైంది. స్పర్థలతో నిండిపోయింది.

మూఢనమ్మకాలు, మూఢాచారాలు, మూఢవిశ్వాసాలు, కులమత భేదాలు ఒకవైపు, నాస్తికవాదం, హేతువాదం, సినిమావంటి ప్రలోభాలు, కాలక్షేపాలు, విచ్చలవిడితనం మరొకవైపు – మానవసమాజాన్ని అతలాకుతలం చేసాయి. అటువంటి పరిస్థితులలో దత్తస్వామి తాను అవతరించి ధర్మమార్గాన్ని పునఃప్రతిష్ఠ చేస్తానని ప్రతిజ్ఞ పూనారు. అట్టి గందరగోళంలో దయనీయంగా వున్న నేటి సమాజపు దుర్భర పరిస్థితులలో దత్తస్వామి సమర్థసద్గురువైన శ్రీ సాయినాథుని గాను, సమర్థులు, సచ్ఛిష్యులు, సద్భక్తులైన పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగార్ల రూపంలో మనమధ్య అవతరించారు. ఇట్టి భయంకరమైన నేటి సమాజంలో ఎలా క్షణక్షణమూ ఆలోచించుకుంటూ ఆచరిస్తూపోతే మనం ధర్మబద్ధమైన జీవితాన్ని గడపవచ్చో, సాయినాథుని బోధలు, ఆచరణ మనకు సూచిస్తాయి. అట్టి సమర్థ సద్గురుని బోధలను అనుక్షణమూ మన నిత్యజీవితంలో ఎలా అన్వయించుకుని ఆచరించవచ్చో మాస్టరుగారు, అమ్మగారు మనకు బోధించారు. ఆచరించి చూపారు. అన్ని మతాలకు అతీతమైన, అన్ని మతాలకు మన జీవితానికి ప్రకృతి సూత్రాలకు సమన్వయ రూపమైన జీవిత విధానాన్ని మనకు బోధించారు కనుక వారి బోధలు, జీవితమే మనకు గతి. సద్గతి.●

# మాతృదేవి స్మృతులు

**శ్రీమతి భవాని, నెల్లూరు**

పూజ్యశ్రీ అలివేలు మంగమ్మతల్లి లీలావైభవాన్ని నెల్లూరుకు చెందిన శ్రీమతి భవానిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు.

మాకు పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి, వారి గ్రంథాల గురించి మా అమ్మ ద్వారా తెలిసింది. మేమందరమూ చిన్నతనం నుంచే పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలు, పత్రికలూ పారాయణ చేసేవారము. నేను పూజ్యశ్రీ మాస్టరుగారిని నెల్లూరు వచ్చినపుడు ఒకసారి దర్శనం చేసుకున్నాను.

పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందాక కొంతకాలానికి మొట్టమొదటిసారి ఒంగోలులో పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి మా కుటుంబసభ్యులందరమూ వెళ్లాము. పూజ్యశ్రీ అమ్మగారు మమ్మల్ని కుశలప్రశ్నలు వేశారు. పూజ్యశ్రీ అమ్మగారిని చూడగానే నాకు బాగా ఆప్యాయత కలిగింది.

తిరిగి రెండవసారి చీరాల స్వామి ఆరాధన రోజున ఒంగోలు వెళ్లాము. అక్కడ పూజ జరుగుతున్నది. పూజ పూర్తయ్యాక పత్రిక కోసం ఫోటోలు తీస్తున్నారు. నాకు కూడా పూజ్యశ్రీ అమ్మగారితో ఒక ఫోటో తీయించుకోవాలనిపించింది. పూజ్యశ్రీ అమ్మగారిని అడిగితే దయతో ఒప్పుకున్నారు. నేను, మా ఇద్దరు అబ్బాయిలు, మా తమ్ముడు, మరదలు పూజ్యశ్రీ అమ్మగారి పాదాల దగ్గర కూర్చుని ఫోటో తీయించుకున్నాము. తరువాత పూజ్యశ్రీ అమ్మగారు హైదరాబాద్ వెళ్లిపోయారు. ఇక పూజ్యశ్రీ అమ్మగారిని దర్శించుకోవడానికి కుదరలేదు.

ఒకసారి ఇంట్లో ఏదో సమస్య వస్తే, "మాస్టరుగారూ! మాకేమైనా సమస్యలు వస్తే ఇదివరకు మీతో చెప్పుకునేవారము. ఇప్పుడు మాకెవరున్నారు?" అని బాధపడ్డాను. మరునాడు నాకొక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నంలో మేమందరం పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనానికి వెళ్లి, వారికి మల్లెపూల మాల వేసి నమస్కారం చేసుకున్నాము. పూజ్యశ్రీ మాస్టరుగారు లోపలకు వెళ్ళి పూజ్యశ్రీ అమ్మగారిని తీసుకువచ్చారు. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు నడుస్తున్నారు. మేము మాస్టరుగారికి వేసిన పూలమాల అమ్మగారి మెడలో వుంది. పూజ్యశ్రీ మాస్టరుగారు మమ్మల్ని పూజ్యశ్రీ అమ్మగారికి పాదనమస్కారం చేసుకోమన్నారు. స్వప్నం ముగిసింది.

ఈ స్వప్నసందేశం ప్రకారం ఇకనుంచి మా సమస్యలు పూజ్యశ్రీ అమ్మగారితో చెప్పుకోమని పూజ్యశ్రీ మాస్టరుగారు సూచించినట్లు అనిపించింది. అప్పటివరకు 'హైదరాబాద్ చాలా దూరం.. వెళ్లలేము' అనుకున్నదాన్ని వెంటనే దర్శనం చేసుకోవాలనిపించి, దుర్గాష్టమి రోజున నాగోలు వెళ్లి పూజ్యశ్రీ అమ్మగారిని దర్శించుకున్నాను. మా పిల్లలను

కూడా తీసుకెళ్ళాను. నాకు వారితో మాట్లాడాలంటే బెరుకుగా వుండి నేను చెప్పాలనుకున్నవన్నీ మనసులోనే చెప్పుకుని పూజ్యశ్రీ అమ్మగారి ఆశీర్వాదం తీసుకుని బయలుదేరాను. అలా నవమిరోజున, దశమిరోజున కూడా దర్శనం చేసుకున్నాను.

ఒకరోజు స్వప్నంలో మా ఇంటి దగ్గర శివాలయానికి దర్శనానికి వెళ్లాను. ఆ రోజు దుర్గాష్టమి. అప్పుడు అక్కడ వున్న అమ్మవారికి నమస్కారం చేసుకుంటే పూజ్యశ్రీ అలివేలు మంగమ్మతల్లి ఆ విగ్రహంనుంచి బయటకు వచ్చారు! నేను ఆ చుట్టుపక్కల వున్న వారితో, “మా అమ్మగారు వచ్చారు!” అని చెప్తే అందరూ నమస్కారం చేసుకున్నారు. అలా పూజ్యశ్రీ అమ్మగారు సాక్షాతూ జగన్మాత అని నిరూపణ అయింది! అప్పటినుంచి నేను శివాలయానికి వెళ్ళినప్పుడల్లా, అక్కడి శివుని రూపంలో పూజ్యశ్రీ మాస్టరుగారిని, అమ్మవారి రూపంలో పూజ్యశ్రీ అమ్మగారిని భావించి నమస్కారం చేసుకుంటాను.

ఒకసారి మా ఇంట్లో తీవ్రంగా సమస్యలు వచ్చినప్పుడు నేను పూజ్యశ్రీ అమ్మగారితో విన్నవించుకున్నాను. శ్రీ సాయిలీలామృతం సప్తాహ పారాయణ చేయమని, తీరిక సమయంలో ఏదైనా మహాత్ముని చరిత్ర చదవమని పూజ్యశ్రీ అమ్మగారు చెప్పారు. ఇంట్లో అదేవిధంగా చేయడం మొదలుపెట్టాను. అయితే ‘ఏ మహాత్ముల చరిత్ర చదవాలి?’ అని ఆలోచిస్తుంటే, కొద్దిగా మగతగా నిద్ర పట్టినట్టు అనిపించింది. అది పూర్తిగా నిద్ర కాదు, అలాగని మెలకువ కాదు! ఆ స్థితిలో పూజ్యశ్రీ మాస్టరుగారు బాసిపట్టు వేసుకుని నా ఎదురుగా కూర్చుని, “ఆనందమాయి చరిత్ర మహా ఆనందంగా వుంటుంది!” అన్నారు. చాలా ఆనందంగా ఆనందమాయి చరిత్ర మొదలుపెట్టాను. పూజ్యశ్రీ అమ్మగారు నా సమస్యకు పరిష్కారంగా ఏదైనా మహాత్ముని గ్రంథం చదవమని చెప్తే, ఏ మహాత్ముని గ్రంథం చదవాలో పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పారు! కనుక వారిద్దరికీ భేదం లేదని స్పష్టమైంది.

హైదరాబాదులో నాగోలులో ఏదైనా ఉత్సవం జరుగుతున్నప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు నాకు స్వప్నదర్శనమిచ్చేవారు. అలా దర్శనమిచ్చినప్పుడు ఆ ఉత్సవానికి హాజరయ్యే అవకాశం వచ్చేది! మామూలుగా అయితే కుదిరేది కాదు. కానీ పూజ్యశ్రీ అమ్మగారు దర్శనమిస్తే మా ఇంటి పరిస్థితులు అనుకూలించేవి. కొంతకాలానికి మా అబ్బాయి కోచింగ్ కోసం హైదరాబాదులో రూమ్ తీసుకున్నాడు. ఆ విధంగా నాకు పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో జరిగే ఉత్సవాలకు వచ్చే అవకాశం కలిగింది. ఎక్కువగా డిసెంబర్ 31 రాత్రి, దత్త జయంతి, గురు పూర్ణిమ – వీటన్నిటికీ హాజరయ్యేదాన్ని.

పూజ్యశ్రీ అమ్మగారు నాగోలులో వున్నప్పుడు అక్కడ సేవ చేసుకునే వారిని చూసి నాకు కూడా సేవ చేసుకోవాలనిపించేది. పూజ్యశ్రీ అమ్మగారు సిద్ధి పొందాక ఒకసారి స్వప్నంలో, “నువ్వు సేవకు రావచ్చు కదా!” అన్నారు. అప్పుడు నేను, “మా ఇంట్లో పరిస్థితులు అందుకు సహకరించవు కదా అమ్మగారు!” అన్నాను. పూజ్యశ్రీ అమ్మగారు చిన్నగా తల ఊపుతూ ఆలోచిస్తున్నారు. స్వప్నం ముగిసింది. ఆ తర్వాత పూజ్యశ్రీ అమ్మగారి దయవల్లనే నాకు గుమ్మళంపాడులో వారి సన్నిధిలో సేవ చేసుకునే అవకాశం లభించింది. అక్కడ పూజ్యశ్రీ అమ్మగారు ఎన్నో లీలలు చేశారు!

ఒకసారి అందరం కలిసి పూజ్యశ్రీ అమ్మగారికి ఘనంగా పూజ చేసుకుందామని సంకల్పించాము. ఆ సందర్భంగా వస్త్రాలు తెప్పించుకొని, అక్కడున్న వారందరికీ పిండివంటలతో భిక్ష సమర్పించుకుందామని క్యాటరింగ్ వారికి చెప్పుకున్నాము. ఆరోజు ఉదయం పూజకు అంతా సిద్ధం చేసుకున్నాము. అయితే నివేదన మాత్రం మేము కేటరింగ్ నుంచి తెప్పించుకుంటున్న తీపి పదార్థాలతో చేద్దామని, పూజ జరిగే సమయానికి అవి వచ్చేస్తాయన్న ఉద్దేశంతో వేరే ఏర్పాట్లు చేయలేదు. మేము ఇలా పూజ మొదలుపెట్టగానే పెద్ద వర్షం వచ్చింది. దాంతో బయటనుంచి వచ్చే పదార్థాలు రావడం ఆలస్యమైంది. పూజలో భాగంగా ‘నైవేద్యం సమర్పయామి’ అన్నప్పుడు అక్కడ నైవేద్యాలు లేకపోవడంతో చాలా బాధపడ్డాము. కానీ ఆ సమయానికి ముగ్గురు ఆడవాళ్లు (ఆ చుట్టుపక్కల గ్రామాల వాళ్ళలా వున్నారు) మూడు రకాల తీపి పదార్థాలు స్వయంగా వండి,

***మిగతా 29వ పేజీలో***

# లోక కళ్యాణ ఘడియ!

**శ్రీమతి అడిదం వేదవతి**

సం॥1975 మార్చి 6వ తేదీన సమర్థ సద్గురు దంపతులైన పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు పూజ్యశ్రీ అమ్మగార్ల వివాహం జరిగింది.

పూర్ణవిరాగి, సన్యాసాశ్రమానికి తన మనస్సుకు, శరీరానికి తీవ్ర తర్ఫీదు నిచ్చుకున్న పూజ్యశ్రీ మాస్టరుగారికి, అవివాహితగా ఆధ్యాత్మిక జీవితంలో కొనసాగాలని నిర్ణయించుకొని జిల్లెళ్ళమూడి అమ్మ సేవలో, సాయి సేవలో తీవ్ర వైరాగ్యమూర్తి అయిన అమ్మగారికి ఆ రోజు వివాహమైంది.

శిరిడీలోని శ్రీ సమర్థ సద్గురు సాయినాథుని అనుగ్రహానికి పాత్రులై ఆత్మానుభూతిని పొంది సాయియే తానైన సద్గురు భరద్వాజులకు – మహాత్ముల ఆదేశంతో అమ్మగారు భరద్వాజులే తానైన శుభగడియ అది!

అదే లోకకళ్యాణ ఘడియ!!

నిత్యసత్యులైన సమర్థ సద్గురు సాయినాథుని ఎలా సేవించి తరించాలో– గృహస్థులమైన మనం ఆయన బోధలను, లీలలను నిత్యజీవితంలో ఎలా అన్వయించుకొని ఆచరించి తరించాలో– తాము ఆచరించి చూపి, బోధించి అలా చేయడం వల్ల ఎంతటి ఆధ్యాత్మిక ఉన్నతిని పొందవచ్చో నిరూపించిన సద్గురు దంపతులు మనకు లభించిన శుభదినం అదే!

సం॥1970లో పూజ్యశ్రీ మాస్టరుగారికి పూజ్యశ్రీ అలివేలుమంగమ్మగారిని వివాహం చేసుకోవాలని మహాత్ముల నుంచి ఆదేశం వచ్చింది. వారి వివాహం జరిగింది 1975లో! కళ్యాణానికి ఏర్పాట్లు చేసుకోవడానికి చాలా సమయం ఉన్నదనిపిస్తుంది మనందరికీ. కానీ ఈ మధ్యకాలంలో వారిద్దరూ కలుసుకోలేదు, మాట్లాడుకోలేదు. ఎవరి ఆధ్యాత్మిక సాధనలో వారు వున్నారు, అంతే! తీవ్ర విరాగులకు మాత్రమే ఇది సాధ్యం.

ఇంతా చేస్తే వారి వివాహం మార్చి 6, 1975న! ఇక అంతా హడావిడే. పెళ్లి పత్రికలు అచ్చువేయించడం, టెలిగ్రాములు పంపడం, విడిది ఏర్పాట్లు అన్ని హడావిడిగానే జరిగాయట. వివాహ పత్రికలు, టెలిగ్రాములు అందక చాలామంది బంధువులు స్నేహితులు రాలేకపోయారట. బనగానపల్లి పల్లెటూరు కావడంతో సరియైన రవాణా సౌకర్యాలు లేక వచ్చిన వారు చాలామంది ఇబ్బంది పడ్డారట. హడావిడిలో పెళ్లి ఏర్పాట్లు సరిగ్గా జరగలేదట!

అన్నింటికంటే ఆశ్చర్యకర విషయం ఏమిటంటే పూజ్యశ్రీ మాస్టరుగారి తండ్రిగారైన శ్రీమాన్, అనంతాచార్యులుగారు పెళ్లిరోజు వరకు అమ్మగారిని చూడనే లేదట! అసలు మాస్టరుగారి బంధువులెవ్వరూ అమ్మగారిని చూడనేలేదు. పెళ్ళి చూపులు లేవు, కట్న కానుకలు లేవు.

ఒక్క పూజ్యశ్రీ మాస్టరుగారి వదినగారైన శ్రీమతి రాణీసంయుక్తగారికి మాత్రం అమ్మగారితో జిల్లెళ్ళమూడిలో పరిచయం. కానీ ఆవిడకూడా వివాహానికి రాలేకపోయారు. మాస్టరుగారి తరపున అన్నగారైన వేదవ్యాసుగారు, శ్రీమాన్ అనంతాచార్యులుగారు, పిన్నిగారైన శ్రీమతి లక్ష్మిగారూ తప్ప మరెవ్వరూ హాజరవలేదు. కొద్దిమంది సత్సంగసభ్యులైన కాలేజీ విద్యార్థులు ఆయనతో కలిసి వచ్చారు. అమ్మగారైతే పెళ్ళిపీటల మీద కూర్చునే వరకూ తన పెళ్ళిపనులలో తానే నిమగ్నమై వున్నారట! 'నీదేనమ్మా పెళ్ళి, పెళ్ళి పీటలమీద కూర్చో!' అని ఎవరో చమత్కరించారట కూడా!

ఇదంతా చూస్తే పూజ్యశ్రీ మాస్టరుగారి. అమ్మగారి పెళ్ళి ఎంతో హడావిడిగా నిరాడంబరంగా, బంధుమిత్రులు ఎక్కువగా లేకుండా జరిగిపోయింది. ఇది మానవమాత్రులమైన మన కంటికి కనిపించే

కుటుంబ పెద్దలు చేసిన పెళ్ళి తంతు. పామరులమైన మన అంచనా వేరుగా వుంటుంది. మహాత్ములు, సాక్షాత్తూ సమర్థ సద్గురుడైన సాయినాథుడు చేసిన ఇద్దరు మహనీయమూర్తుల వివాహం వైభవంగా, ఏ లోటూ లేకుండా జరిగిపోతుందనీ, జరిగివుంటుందనీ భ్రమిస్తాము. కానీ నిజానికి అలా జరగలేదు. అతి నిరాడంబరంగా, అత్యంత తక్కువమంది బంధుమిత్రులతో సాదాసీదాగా జరిగింది. అదీ సామాన్యులమైన మన దృష్టిలో!


కానీ మరి శ్రీ సాయినాథుని దృష్టిలో? ఇతర మహనీయుల దృష్టిలో? వారంతా 1970 ముందునుంచే మాస్టరుగారి వివాహపు ఏర్పాట్లలో నిమగ్నమై వున్నారు.

ముందుగా ఆజన్మాంతము వివాహము చేసుకోకుండా ఉండాలని నిర్ణయించుకున్న మాస్టరుగారిని వివాహానికి ఒప్పించాలి. శ్రీ చీరాలస్వామి, శ్రీ పాకలపాటి గురువుగారు, ఇంకా ఇతర మహాత్ములు, చివరకు శ్రీ సాయినాథులూ అందుకు పూనుకున్నారు. ఎలాగో మాస్టరుగారు అంగీకరించారు.

వివాహానికి ఒప్పిస్తే సరిపోదు. తగిన అర్ధాంగిని సూచించాలి కదా? శ్రీ పాకలపాటి గురువుగారు సాటిలేని విరాగి, జ్ఞాని, విజ్ఞాని, భక్తుడు అయిన పూజ్యశ్రీ మాస్టరుగారికి సరిపోయే అర్ధాంగిని వెతికి వెతికి చివరకు పరిపూర్ణ విరాగి, భక్తురాలు అయిన అమ్మగారిని సూచించారు. అదే నిర్ణయాన్ని సమర్థ సద్గురుడైన సాయినాథుడు ఆమోదించారు. అమ్మగారికి తగిన స్వప్న సందేశాలను అనుభవాలను ఇచ్చి ఆమెను కూడా వివాహానికి ఒప్పించారు. వారి వివాహ శుభ ఘడియ మార్చి 6 1975 నిర్ణయమైంది.

లౌకికమైన సామాజిక వ్యవహారాలు ఆ పవిత్ర కార్యాన్ని ఆటంక పరచకుండా, ప్రాపంచికులైన బంధుమిత్రులు ఎక్కువగా తరలి రాకుండా చివరి నిమిషంలో వివాహ సమయం నిర్ణయమయ్యేలా జాగ్రత్త పడ్డారు మహాత్ములు.

వేదమూర్తులైన శ్రీమాన్ ఎక్కిరాల అనంతాచార్యులు దంపతులు, మొదట శ్రీ శిరిడీ సాయినాథుని పూజ్యశ్రీ మాస్టరుగారికి పరిచయం చేసి ఆయన ఆత్మానుభూతికి నిమిత్తమాత్రులైన శ్రీ వేదవ్యాస్ గారు, పూజ్యశ్రీ మాస్టరుగారి సత్సంగ సభ్యులైన కాలేజీ విద్యార్థులు - వీరే ఆ వివాహానికి అతిథులు. పరమ భక్తులైన పూజ్యశ్రీ అమ్మగారి



కుటుంబ సభ్యులు, కొందరు బంధువులు ఆడపెళ్ళివారు! ఆశ్చర్యకరంగా ఆధ్యాత్మిక జీవితానికి ప్రయత్నిస్తున్నవారే ఆ వివాహానికి హాజరయ్యారు.

పూజ్యశ్రీ అమ్మగారికి స్వప్నంలో బాబా కనిపించిన గుడిలోనే, ఆ ప్రదేశంలోనే గౌరీ పూజ చేయించారు. ఆ వివాహానికి శిరిడీ నుంచి ప్రసాదం తీసుకొని వేదవ్యాసుగారు హాజరయ్యారు. అలా శిరిడి నుంచి ప్రసాదం రూపంలో శ్రీ సాయి అక్కడికి చేరుకున్నారు. సాయిసన్నిధిలో, సకల దేవతల మహాత్ముల సమక్షంలో, ఆశీస్సులతో, వారిద్దరి వివాహమైంది. ఆ రోజు సత్సంగంతో, భజనతో, నామస్మరణలతో ఆ ప్రదేశం మారుమ్రోగిపోయింది. నేటి దేశ కాల పరిస్థితిలకు సరిపడు సద్గురు సాంప్రదాయానికి ఆనాడే శుభారంభం జరిగింది. అందుకే అది కళ్యాణ ఘడియ మాత్రమే కాదు లోక కళ్యాణ ఘడియ సుమా!

***(మార్చి 2018 పత్రిక నుండి పునర్ముద్రితము)***

# పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

**ప్రశ్న :- క్రైస్తవంలో పునర్జన్మలేదు? ఆ మతంలో క్రీస్తు పునరుద్ధానం మరియు తీర్పుదినము ప్రధానాంశాలు. హిందూమతంలోగాని, బాబా బోధలోగాని పాపక్షాళనం చేసుకోవాలన్న భావం అంత స్పష్టంగా చెప్పబడలేదు. అన్ని మతాలు ఒకటే ఎలా అవుతాయి?**


**- యం. వి. అప్పారావు, బసంత్ నగర్**

**జవాబు :-** మత గ్రంథాలేగాక మతాల చరిత్ర గూడ ఎంతో నిశితంగా విస్తారంగా ఎవరూ చదవకపోవడంవలననే ఇలాంటి సందేహాలు కల్గుతాయి. అవి సరిగా చదవని నకిలీ పండితులు; ధనము, కీర్తులను మాత్రమే ఆశించి ఆధ్యాత్మ ప్రచారానికి పూనుకుంటున్న నకిలీ గురువులు, స్వాముల వలన ఇట్టి అపోహలు బలపడుతున్నాయి.

ఏసు మరణించిన ఎంతోకాలానికి ఆయనగురించి వ్యాపించిన కథల, స్మృతులనుండి కొన్నింటిని కూర్చి నేటి బైబిల్లోని క్రొత్త నిబంధన రూపొందించబడింది. ఆ స్మృతులలో ఏసు పునర్జన్మల గురించి చెప్పిన సందర్భాలెన్నో ఉన్నాయి. అంతేకాదు. యూదుమతంలో వర్ణ వ్యవస్థ వుండేది. అగ్రవర్ణస్థులైన యూదులకు మాత్రమే బోధించబడిన ఆర్ష ధర్మాలలో పునర్జన్మకూడ ఒకటని ఇటీవల కనుగొన్నారు. కాని క్రొత్త నిబంధనలను కూర్చిన పండితులు పునర్జన్మ గురించిన బోధలను తొలగించుకున్నారు. నేడు పాశ్చాత్య దేశాలలో గూడ కొందరికి పూర్వ జన్మ స్మృతులు కలగడం వలన ఆ దేశాలలోని యువతరానికి క్రైస్తవంపై విశ్వాసం తొలగి హిందూధర్మంపై మక్కువ కల్గుతున్నది. హరే కృష్ణ ఉద్యమం వంటివి పెరిగిపోతున్నాయి.

హిందూ, బౌద్ధ, జైన, ఇస్లాం మొదలైన మతాలన్నింటికీ ధర్మం ప్రధానం. ధర్మంలో ప్రాయశ్చిత్తం ప్రధానం. ఈ జన్మలో చేసిన పాపాలకు పశ్చాత్తాపం చెంది తన తప్పు పండిత సభలో ఒప్పుకొని ప్రాయశ్చిత్తం చేసుకోవడం ప్రతివారికి తప్పనిసరి. గత జన్మలలో చేసుకొన్న వాటిని కొంతవరకూ దానము, ప్రాయశ్చిత్తము, తపస్సులతో తొలగించుకోవచ్చును. కొంత అనివార్యంగా అనుభవించితీరాలి. ఇదంతా పాపక్షాళనమే గదా! పాపపు తలంపులు ముందు కల్గకుండా చూచుకోవడం కోసం సంస్కారము, ధర్మాచరణ, సత్సాంగత్యము చెప్పారు. ఒక విధంగా చెప్పాలంటే పాపక్షాళనం గురించి ఈ మతాలలో చెప్పినంతగా క్రైస్తవంలో చెప్పలేదు.

ఆదిమానవులు చేసిన అతిక్రమణవలన మానవజాతి అంతటికి పాపము, దుఃఖము, మరణము




సంక్రమించాయని, వాటినుండి తన ఆత్మ బలిదానము వలన మానవజాతిని ఏసు రక్షించాడని క్రైస్తవమతం చెబుతుంది. కాని ఈ నాటికీ మానవులకు అవితప్పడం లేదంటే, ఆయనను విశ్వసించిన వారికి మాత్రమే ఆయన రక్షణ లభిస్తుందంటారు. ఆయనను విశ్వసించని వారందరూ పాపులని క్రైస్తవ ప్రచారకులు చెబుతున్నారు. అప్పుడు వారినే గదా ఆయన రక్షించాల్సింది? అసలు క్రీస్తు వచ్చింది వీటిని అతిక్రమించటము ఎలాగో మానవులకు తెల్పడానికే, తాము చెప్పినవి అనుసరించినవారు మాత్రమే రక్షింపబడతారని మత్తయి సువార్తలోని కొండమీది ప్రవచనంలో ఆయన చెప్పారు. ఆయన చెప్పిన సూత్రాలు అన్ని మతాలలోనూ వున్నవే. మన మతంలో వలెనే ఏమీ చదవకనే, అర్థం చేసుకోనకొనే డబ్బు, ఉద్యోగము, రాజకీయ బలము కోసము గుడ్డిగా మత ప్రచారము చేసేవారి వలన ఈ వ్యాఖ్యానాలు మరుగుబడ్డాయి. “శాస్త్రాలు ఎన్నటికీ అబద్ధంకావు. వాటికి పనికి మాలిన అర్థం తీసుకొని తికమక పడేదినీవే” అని నానా చందోర్కరునితో సాయిబాబా చెప్పిన వాక్యం అన్ని మతాలవారికి నిత్యసత్యం. సాయి వంటి మహనీయులవల్ల మాత్రమే సర్వమతాలకూ మూలమైన వాస్తవాలు తెలుసుకోవడం సాధ్యం. ఏసు అట్టివాడే గనుక తమ ద్వారా తెలుసుకొమ్మని ఆయన చెప్పిన మాటకు తమ మౌఢ్యము, స్వార్థమూ జోడించి ఆర్థిక రాజకీయ ప్రయోజనాల కోసం మత మౌఢ్యం ఇలా ప్రచారం చేస్తుంది. బైబిల్ కూలంకషంగా తెలిసిన వారిలో ప్రముఖుడని ప్రఖ్యాతి పొందిన అమెరికన్ ‘పాల్ రెప్స్’ (Paul Reps) నేను వ్రాసిన ఆంగ్ల సాయిబాబా జీవిత చరిత్ర (Sai Baba the Master) చదివి, “మీరు వ్రాసిన బాబా చరిత్ర చదివితేతప్ప నాకుగాని, మరెవ్వరికీ గాని ఏసు జీవితంలోని బోధ అర్థంగాదు” అని వ్రాశాడు.


## FORM IV

**Statement about ownership and other particulars about SAI BABA (according to Form IV Rule 8, circulated by Registrar of Newspapers for India)**

**1. Place of Publication :** Vijayawada
**2. Periodicity of Publication :** Monthly
**3. Printer's Name :** G.Ravi Dayal
**Nationality :** Indian
**Address :** D.No.32-26-110/6,
Narra Gopala Krishnaiah Street,
Maruthinagar,
Vijayawada-520004.
**4. Printer's Name :** Dr. R.S. Sasidhar
**Nationality :** Indian
**Address :** 9-30/7, Prashanth Nagar,
Boduppal,
Hyderabad- 500092
**5. Editor's Name :** Dr. R.S. Sasidhar
**Nationality :** Indian
**Address :** 9-30/7, Prashanth Nagar,
Boduppal,
Hyderabad- 500092
**6. Name and Address of the individuals who own the news or shareholders holding more than 1% of the capital :** Vikramaditya Ekkirala
Flat No. 501 Balijepalli Fortune Homes,
H. No. 2-2-185/56/C/2/A
Street No. 15, Somasunder Nagar,
Bagh Amberpet, Hyderabad -500013

I, **Dr. R.S. Sasidhar**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief

**DATE: 01.03.2025**

**Sd.**
**Dr. R.S. Sasidhar**
Signature of the Publisher

# మాతృదేవి సన్నిధిలో బ్రహ్మానుభూతి మహోత్సవము!

*శ్రీమతి టి. పద్మావతి*

ఫిబ్రవరి 9, 2025 న బ్రహ్మానుభూతి మహోత్సవము, 'శ్రీ అలివేలు మంగమ్మ దివ్యసన్నిధానము' లో అద్భుతంగా జరిగింది.

ఆ శుభదినాన సూర్యోదయ వేళ పూజ్యశ్రీ అమ్మగారికి, పూజ్యశ్రీ మాస్టరుగారికి మేలుకొలుపు, అనంతరం సమర్థ సద్గురు సాయినాథులకు కాకడ ఆరతితో కార్యక్రమాలకి శ్రీకారం చుట్టారు. తరువాత ప్రత్యేక మంగళ స్నానం, బృందావనానికి ప్రత్యేక అలంకరణ గావించి, అల్పాహార నివేదన సమర్పించారు.

విశేషపూజకి అన్నీ సమకూర్చుకుని,

*"అపూర్వ సంగమము,*
*అది అద్భుత సంగమము;*
*సాయినాథుని భరద్వాజుని*
*అపూర్వ సంగమము,*
*అది అద్భుత సంగమము"*

– అని పూజ్యశ్రీ అమ్మగారు 1963 ఫిబ్రవరి 9వ తేదీన శిరిడి సమాధి మందిరంలో పూజ్య గురుదేవులు శ్రీ భరద్వాజ మాస్టరుగారికి జరిగిన అపూర్వ సంఘటనని పాటరూపంలో విరచించినట్లు, అచ్చటి వారందరూ ఆనాడు శిరిడీలో జరిగిన ఆ అద్భుత సంఘటనని తలచుకుంటూ సేవ చేసుకుంటున్నారు. కొద్ది సేపటికి గురుకుటుంబం మాతృదేవి సన్నిధికి చేరి, అమ్మ ఆశీస్సులు తీసుకుని కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు సత్సంగం చేసారు. అందులో కొన్ని విశేషాలు ఇక్కడ ప్రస్థావించుకుందాము.

పరమ పవిత్రమైన ఈరోజు, ఇక్కడ, పూజ్యశ్రీ మాస్టరుగారి సన్నిధిలోనూ, ఎక్కడెక్కడ ఎవరెవరు, ఈ బ్రహ్మానుభూతి మహోత్సవము జరుపుకుంటున్నారో వారందరికీ ప్రత్యేకమైన ఆశీస్సులు అందించమని ప్రార్థన! మన సాంప్రదాయంలో యజ్ఞాలు, యాగాలు, పెళ్లిళ్లు, పుట్టినరోజులు, ఇలా అనేక సంస్కారాలు వున్నాయి. ఇవన్నీ కూడా రెండే విషయాలు మీద ఆధారపడి ఉన్నాయి. మొదటిది భగవంతుడు అన్నిటిగా అంతటా ఎప్పుడూ ఉన్నాడు, ఇది ప్రాథమికమైన ఉత్తమోత్తమమైన సత్యం! రెండవది, పై విషయం అనుభవపూర్వకముగా తెలిసినవాడు భగవంతుడుతో సమానం, వారి పేరే గురువు! కాలంతో జనబాహుళ్యములో ఈ రెండింటి ప్రాచుర్యం తగ్గింది. ఈ ప్రాచుర్యం తగ్గడానికి ఒక కారణం ఒక ఉదాహరణ రూపంలో చెప్పుకోవచ్చు.

ఒకడు అతని తల్లికి మోకాళ్ళ నొప్పి వస్తే డాక్టరు దగ్గరికి తీసుకెళ్తాడు, ఆయన ఏదో ఒక తైలం ఇచ్చి రాయమని చెప్తారు. దాంతో ఆవిడకి మోకాళ్ళ నొప్పి తగ్గిపోయి కాలాంతరంలో వయసు అయిపోవడం వల్ల చనిపోతుంది. తరవాత ఇతడు, 'ఈ నూనె చాలా గొప్పది మా అమ్మ రాసుకుంది, చాలా బాగా పనిచేస్తుంది' అని ఆ తైలం మీద వ్యాపారం మొదలుపెట్టి, నొప్పులకే కాకుండా, తుమ్ముకి, దగ్గుకి, అన్నింటికీ కూడా అదే తైలం పని చేస్తుందని ఇవ్వడం మొదలుపెట్టాడు. ఆ

తరం వెళ్ళి, ఆ తరవాత తరంలో వాడు ఏం చేసాడంటే, ఇది ఒక చుక్క తాయత్తులో కట్టుకుంటే నొప్పులు తగ్గుతాయి, మంగళసూత్రాలలకి అద్దుకుంటే సౌభాగ్యం నిలుస్తుంది,,, ఇలా మొదలుపెట్టి, వాడు వ్యాపారం చేసాడు. ఆఖరికి దాన్ని వాడేవాళ్ళ సంఖ్య పెరిగి తైలం దొరకడం తక్కువైపోయింది. ఆ తర్వాత తరం వాడు ఏం చేశాడంటే, ఇది ఒక చుక్క ఏ నూనెలోనైనా సరే వేసుకుని రాసుకుంటే బాధలు వ్యాధులు తగ్గుతాయి,,, అని వాడు వ్యాపారం చేసాడు. ఆఖరికి కొన్ని తరాలు గడిచిన తర్వాత దాన్ని చూస్తే చాలు మోక్షం వస్తుంది. దాన్ని ముట్టుకుంటే చాలు నొప్పి తగ్గిపోతుంది, ఇలా తయారయింది.

ఇలా తరతరాలు మారినప్పుడు దాని తాలూకు కథ మార్చి వ్యాపారం చేయడం వల్ల అసలు నిజం పక్కకి పోయింది. ఇలాగే మన సనాతన సంప్రదాయంలో కూడా జరిగింది, జరుగుతోంది. అందువల్ల ఈ విశ్వమంతా వ్యాపించిన చైతన్యాన్ని అనుభవపూర్వకంగా పొందిన గురువు, మహాత్ములు, ఋషులు,,,వీళ్ళని ఆశ్రయించడం తప్ప మనకి మార్గం లేదు. ఇదే మన సనాతన సంప్రదాయానికి పట్టుకొమ్మ. దీన్ని మర్చిపోవడం వల్లే ఇన్ని రకాల గందర గోళాలు వస్తున్నాయి.

ఉత్తమంగా బ్రతకడానికి ఏది కావాలి అంటే,, నీకూ, నలుగురికి, మంచి జరిగేది ఏం చేస్తావో అది ఉత్తమమైన సంప్రదాయమని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పాడు. నీకు రాసిపెట్టిన దాన్నిబట్టి, పూర్వపుణ్యాన్నిబట్టి, ఋణానుబంధాలనుబట్టి, అన్నీ జరుగుతాయి. వాస్తు, గ్రహాలు, పిల్లి – ఇవేవీ కారణం కాదు. నీ మొత్తం జీవితానికి నీది బాధ్యత! మంచిగా ఉండి, పరోపకారం చేస్తూ, మహాత్ముల సేవ చేస్తే ఇవన్నీ తగ్గుతాయి. అప్పుడు వాస్తు, గ్రహాలు, అన్నీ నీకు అనుకూలంగా పనిచేస్తాయి. నీలో మార్పు రానంత కాలం నీకు ఏదీ పనిచేయదు. దీన్ని విస్మరించడం వల్లే నానా అనర్థాలూ వస్తున్నాయి. భగవంతుడు ఉన్నాడని గాని, ఎలా ఉంటాడని గాని, ఉంటే మనమేం చెయ్యాలి, ఎలా పొందాలని మహాత్ముల దగ్గర నేర్చుకోకపోవడం వల్ల ఇవన్నీ జరుగుతున్నాయి.

పూజ కానీ, భజన కానీ, ధ్యానం కానీ ఎలా చేస్తే అనుగ్రహించాలని, సృష్టి మొత్తం వ్యాపించి వున్న విశ్వచైతన్యమైన భగవంతుడు చెప్పిన దానిని ఎంతగా ఆచరిస్తావో, అంతగా ఫలితం ఆధారపడి వుంటుంది. ఇదంతా మన సాంప్రదాయంలో ఎంతో వివరంగా చెప్పి వుంటుంది. కానీ అదే సాంప్రదాయంలో 'త్రికరణ శుద్ధిగా ఒక్క మారేడు దళం సమర్పించినా భగవంతుడు ఆమోదిస్తాడు' అని కూడా వుంటుంది. అంటే వ్యవహారానికి ప్రాముఖ్యత ఇస్తూ, నువ్వు ఎంత 'శ్రద్ధగా' చేస్తే అంత ఫలితం వుంటుంది, కానీ వ్యవహారాలన్నీ చేసి 'శ్రద్ధని' విస్మరిస్తే దానివల్ల ఏమి ఫలితం వుండదు.

ఆధ్యాత్మికతంతా, వివేకంతో వృద్ధి చెందటం ఎలా? అంతటా వ్యాపించిన శక్తిని ఆశ్రయించి బాగుపడటం ఎలా? ఈ రెండిటికి సద్గురువు మాత్రమే సమాధానం చెప్పగలడు. ఇది అన్ని మతాల్లోనూ వుంటుంది. మన సంప్రదాయంలో ప్రముఖంగా అదే వుంది. సద్గురువును ఆశ్రయిస్తే మాత్రమే, ఋషులను ఆశ్రయిస్తే మాత్రమే, ఒక మహాత్ముడిని ఆశ్రయిస్తే మాత్రమే మనకు పైన చెప్పుకున్నవి సాధ్యపడతాయి. అందుకే విష్ణు సహస్రనామంలో భగవంతుడి నామాలను ప్రార్థించడానికి అది రాసిన వ్యాస మహర్షిని స్తుతించాకే విష్ణువుని స్మరిస్తాం. అలాగే అఘోర ఋషి అని రుద్రంలో కూడా వారిని ముందుగా స్మరిస్తాం. అందువల్ల వారిని తలచుకుంటే మాత్రమే ఏ శాస్త్రమైనా పనిచేస్తుంది. మరి ఇంతటి గొప్ప సాంప్రదాయం ఎందుకు లుప్తమవుతోంది అంటే, వాడుకలో ఆ 'నిజం' అన్నది పక్కకు పోతోంది కనుక !

ఈ సృష్టిని నడిపేవాడు భగవంతుడని అది తెలియజేసేవాడు సద్గురువని ఎప్పుడైతే గుర్తిస్తామో అప్పుడే బాగుపడడం జరుగుతుంది. అప్పుడు మాత్రమే మనిషికి సరైన ఆధ్యాత్మిక పురోగతి ఉంటుంది.

1963 లో ఒక అద్భుతం జరిగింది. శిష్యుడి నిజాయితీ, గురువు సమర్థత కలిసిన నిజమైన ఆధ్యాత్మిక గెలుపు!! 'ఎవరికైనా శిరిడీలో జరిగినట్లు జరిగేదాకా ఏ సాంప్రదాయాన్నైనా నేను నమ్మను' అని అనుకోగలిగితే, సద్గురు సమాగమం మీద ఆసక్తి కలుగుతుంది. పూజ్యశ్రీ మాస్టరుగారు మొదటిసారిగా శిరిడీ దర్శనానికి వెళ్ళి ఏమి పొందారో, దాని గురించి ఆలోచిస్తే మనకున్న తుప్పంతా వదిలిపోతుంది. ఆధ్యాత్మికతకి, మొత్తం సమాధానం ఈ గురుశిష్యుల దగ్గర మాత్రమే దొరుకుతుంది.

ఇటువంటి పరమ పవిత్రమైన రోజున పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రతిరూపమైన పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో మనం వేసుకోవాల్సిన ప్రశ్న ఒక్కటే, వారి అనుగ్రహం

***మిగతా 29వ పేజీలో***

# ద్వారకామాయి అనుభవమండపము

శ్రీమతి బిక్షాల ఓబులేశ్వరి, హైదరాబాదు

దాదాపు 20 సంవత్సరముల క్రితం మా పెద్దక్క కూతురుకి డెంగ్యూ జ్వరం వచ్చింది. .అప్పటికి ఆ పాపకి మూడున్నర సంవత్సరాల వయసు. చాలా తీవ్రంగా జ్వరం రావడం వల్ల నోటిలో పళ్ళ నుంచి రక్తం కారడంతో, గబగబా ఆసుపత్రికి తీసుకువెళ్లాం. అక్కడ వైద్యులు పరీక్ష చేసి "ప్లేట్లెట్స్ సంఖ్య చాలా తగ్గిపోయాయి, ఒక ఇంజక్షన్ కి 50,000 రూపాయలు అవుతుంది అయినా కూడా పాప బతుకుతుందని నమ్మకం లేదు" అని చెప్పారు. మా అక్క ఈ మాట విని తట్టుకోలేక, 'దానితోపాటు నేను కూడా చనిపోతాను' అని ఏడవడం మొదలు పెట్టింది.

నేను అప్పటికే బాబాని పూజించుకునేదాన్ని. బాబా గుడికి వెళ్లడం, పారాయణ, ప్రదక్షిణలు చేయడం నిత్యకృత్యంగా వుండేది. కానీ మా ఇంట్లో మా నాన్నగారికి, మా చుట్టాలకి, ఎవరికీ ఆయన్ని పూజించడం నచ్చేది కాదు. "ఇంక ఎవరూ దొరకనట్టు ముస్లిం దేవుడిని పూజిస్తోంది" అని చాలా గొడవ చేసేవారు. మేము గుత్తిలో రైల్వే క్వార్టర్స్ లో ఉండేవాళ్ళం. అక్కడ నుంచి బాబా గుడి చాలా దూరం, అయినా రోజూ ఉదయమే బాబా గుడికి వెళ్లి ప్రదక్షిణలు, హారతులు, పారాయణలు అన్నీ పూర్తిచేసుకుని, మా నాన్నగారు లేచే సమయానికి ఇంట్లో వుండేదాన్ని. ఎందుకో చిన్నప్పటినుంచి నాకు బాబా అంటే చాలా ఇష్టంగా ఉండేది. నా దృష్టిలో బాబా అంటే విగ్రహము, పటము కాదు, నిత్యము నాతో ఉండే ఒక సన్నిహితుడు. ప్రతి విషయాన్ని ఆయనతో చెప్పుకునేదాన్ని.

అలాగే ఆరోజు కూడా, ఉదయాన్నే గుడికి వెళ్లి బాబాగారితో మా అక్క వాళ్ల పాప విషయం చెప్పి, "ఎలాగైనా నువ్వు రక్షించాలి బాబా, లేకుంటే అక్క బతకదు" అని వేడుకున్నాను. ఇంట్లో అందరూ ఆసుపత్రిలో వున్న కారణంగా, ఆరోజు గుడిలో అన్ని సేవల్లో పాల్గొని, పారాయణ చేసుకుంటూ గుళ్ళోనే మధ్యాహ్నం హారతి సమయం వరకు వుండి పోయాను. హారతి అయ్యాక తిరిగి వస్తూ, "బాబా నేను ఇంటికి వెళుతున్నాను, నాకు నీ నుంచి సమాధానం కావాలి, పాపని ఎలాగైనా బ్రతికించాలి" అని చెప్పుకొని, ఇంటికి తిరిగి వచ్చేసరికి, నాకు చాలా నీరసం వచ్చి కళ్ళు తిరిగినట్టు అయి ముందు గదిలోనే నేల మీద పడుకుండిపోయాను. నా కళ్ళు నీరసంతో మూసుకుపోయాయి. అది నిద్ర మాత్రం కాదు. అప్పుడు నా ముందు ఒక దృశ్యం కనిపించింది. మా అక్క పాప చనిపోయింది, అందరూ స్మశానంలో తనని పూడ్చిపెట్టి ఏడ్చుకుంటూ ఇంటికి తిరిగి వెళుతున్నారు. నేను మాత్రం అక్కడే వున్నాను. అప్పుడు మా వాళ్ళు నాతో, 'నువ్వు ఒక్కదానివి ఇక్కడ ఎందుకు? బయలుదేరు' అన్నారు. 'నేను రాను మీరందరూ వెళ్ళండి' అని చెప్పి వాళ్ళు వెళ్లిన తర్వాత నేను తలబాదుకుంటూ అక్కడే కూర్చుని ఏడుస్తున్నాను. ఈ లోపల విపరీతమైన కాంతితో ఆజానుబాహు రూపంతో బాబాగారు నా వైపు నడిచి వస్తున్నారు. వారు నా దగ్గరకు రాగానే పాదాలు పట్టుకుని ఏడుస్తూ," బాబా! నా ప్రాణాలు తీసుకొనైనా పాపని బ్రతికించవలసింది, ఈ దుఃఖాన్ని మా కుటుంబం భరించలేదు" అని బాగా ఏడుస్తున్నాను. అప్పుడు బాబా, ఆ పాపని పాతిపెట్టిన ప్రదేశంలో, లోపలికి రెండు చేతులు పోనిచ్చి పాపని అలాగే బయటకు తీసి, ఒంటికి

అంటుకున్న మట్టినంతా దులిపారు. పాప వెంటనే మేల్కొంది. ఒక వింత కాంతితో పాప మొహం వెలిగిపోతోంది. బాబా ఆ పాపని నా చేతిలో పెట్టి "ఇదిగో ఈమె తలరాతను మార్చాను, మళ్ళీ పునర్జన్మ ప్రసాదించాను, ఇంక నువ్వు ఏడవకు పాపని తీసుకుని ఇంటికి వెళ్ళు" అని చెప్పారు. అప్పుడే మా ఇంట్లో లాండ్ లైన్ ఫోన్ మోగుతోంది. నేను త్రుళ్ళిపడి లేచాను. ఇప్పటిదాకా జరిగింది నిజం కాదు అని అర్థమయ్యింది. ఇప్పుడు ఈ ఫోను తీస్తే ఎటువంటి మాటలు వినాల్సి వస్తుందోనని భయపడుతూ ఉన్నాను. ఫోను ఆగకుండా మ్రోగుతూనే ఉంది. ఇక తప్పదని నెమ్మదిగా ఫోన్ తీశాను. అటువైపు మా అక్క, "ఈశ్వరీ, అద్భుతంగా పాపకి లక్షకి పైగా ప్లెట్లెట్స్ పెరిగాయి, ఇక ప్రమాదం తప్పిందని వైద్యులు చెప్పారు, నువ్వు బాబావారికి చేసిన పూజలు ఫలించాయి" అని సంతోషంగా చెప్తోంది. నాకు ఒక్కసారి ఒళ్ళు గగుర్పొడిచింది. ఇప్పటివరకు బాబాగారు చూపించిన దృశ్యం నిజం చేశారని, ఆనందంతో కన్నీళ్లు ధారలుకట్టాయి. అప్పటినుంచి మా ఇంట్లో వాళ్ళతో, మీరు తిట్టినా కొట్టినా చంపినా సరే నేను బాబాను పూజించడం మాత్రం మానను అని చెప్పి, ప్రతిరోజూఉదయాన్నే బాబా గుడికి వెళ్లి, నా శాయశక్తుల సేవ చేస్తూనే ఉండేదాన్ని. ఆ రకంగా బాబాకి కృతజ్ఞతలు తెలియజేసుకునేదాన్ని.

ఇక రెండవ లీల! మా ప్రారబ్ధమేమో గాని మాకు ప్రాణాంతకమైన ఆరోగ్యసమస్యలు రావడం, బాబా వారు మమ్మల్ని రక్షించి మాకు పునర్జన్మను ప్రసాదించడం, ఈవిధంగా మమ్మల్ని అనుగ్రహిస్తూనే వున్నారు. 2012వ సంవత్సరంలో మా నానమ్మ గారు కాలం చేశారు. ఆమె చనిపోయిన 11వ రోజున మా చిన్నక్క రాజీకి బాగా నడుము నొప్పి వచ్చింది. ఆసుపత్రికి తీసుకెళితే, వారు కొన్ని మందులు రాసిచ్చి, 'ఇవి వాడి రండి చూద్దాం' అన్నారు. కొన్నాళ్ళకి నడుము నొప్పి పెరిగిపోయి నడవలేని పరిస్థితి వచ్చింది.

వెంటనే తనని అనంతపురం తీసుకువెళ్లి MRI స్కాన్ చేయిస్తే, "వెన్నుపూస పక్కకి జరిగిపోయింది, మూడు నాలుగు రాడ్స్ వెయ్యాలి, డబ్బులు బాగా ఖర్చు అవుతాయి, అయినా తను మామూలుగా లేచి తిరగడం కష్టమే" అని వైద్యులు చెప్పారు. ఏంచెయ్యాలా అని ఆలోచిస్తున్న సమయంలో, బాబాగారి దయవల్ల తిరుపతిలో అలిపిరి దగ్గర 'చరక' అనే ఆయుర్వేద ఆసుపత్రి ఉందని తెలిసి అక్కడికి తీసుకొని వెళ్ళాము. వాళ్ళు తనని చేర్చుకోవడానికి ఒప్పుకుని, 'పంచకర్మ' అనే వైద్యం చేయడం మొదలుపెట్టారు. అప్పుడు అక్కతో నేనే వుండవలసి వచ్చింది. ఎందుకంటే అదే సమయంలో అమ్మకి కూడా ఆరోగ్యం బాగోలేక ICU లో వుంచారు. అక్కడ తమ్ముడు, నాన్న చూసుకునే వారు.. పెద్దక్కకి చిన్న పిల్లలు. మా కుటుంబసభ్యులు మధ్య మధ్యలో వచ్చి చూస్తున్నా, తనతో స్థిరంగా నేనే వుండేదాన్ని. తను కోలుకోవడానికి చాలా రోజులు పడుతుందని వైద్యులు ముందుగానే చెప్పారు. కొన్నాళ్ళ తర్వాత పంచకర్మ చేసే విధానం నాకు నేర్పించి, నన్ను చెయ్యమన్నారు. నాకు అస్సలు విశ్రాంతి దొరికేది కాదు. తెల్లవారుజామున నాలుగు గంటలకు లేస్తే రాత్రి 12 దాకా తనకి సేవ చెయ్యడం సరిపోయేది. ఈ మధ్యలోనే పారాయణలు చేసేదాన్ని. ఆసుపత్రి ప్రాంగణం లోనే వినాయకుడి గుడి ఉంటే ఆయన్నే బాబా అనుకుని, మా రాజీ కోలుకోవాలని ప్రదక్షిణలు చేసి వచ్చేదాన్ని. అలా కొన్ని నెలలు గడిచాక నా ఆరోగ్యం బాగా దెబ్బతింది. నేను తనకంటే చాలా నీరసంగా అనారోగ్యంగా తయారయ్యాను. ఒకరోజు మా రాజీ, "నా అనారోగ్యం వల్ల నిన్ను చాలా బాధ పెడుతున్నాను. కనీసం చనిపోవడానికి కూడా ఇంకొకరి సహాయం కోరవలసిన పరిస్థితిలో ఉన్నాను. నన్ను మేడ మీదకి తీసుకెళ్తే పైనుంచి దూకి చనిపోవాలని ఉంది" అని బాగా ఏడ్చింది. అప్పుడు నేను, నీకు ఏమీ కాదు, బాబా తప్పకుండా నయం చేస్తారు అని చెప్పి ఓదార్చాను. దాదాపు ఒక సంవత్సరం అక్కడ వున్నాము. తర్వాత వైద్యులు కూడా ఇంటికి తీసుకెళ్ళిపొమ్మన్నారు. ఇంక అప్పుడు మాత్రం తట్టుకోవడం నావల్ల కాలేదు. సంవత్సరం శ్రమ వృధా అయిపోయిందని చాలా బాధేసింది. ఎలాగైనా ఈ కష్టం నించి కాపాడమని బాబావారిని తలచుకుని బాగా ఏడ్చాను. అదే రోజు రాత్రి స్వప్నంలో బాబా కనిపించి, "నువ్వు వరుసగా ఏడు రోజులు గుడిలో దీపం పెట్టి ప్రదక్షిణలు చెయ్యి, యెనిమిదో రోజు మధ్యాహ్ననికల్లా అనుగ్రహిస్తాను" అని చెప్పారు ఈ విషయం నేను ఎవరితో చెప్పలేదు కానీ అప్పటి నుంచి బాబాగారు చెప్పినట్టే గుడికి వెళ్ళి దీపాలు పెట్టడం మొదలుపెట్టాను. అదే సమయంలో వైద్యులు మమ్మల్ని రూము ఖాళీ చెయ్యమని తొందర పెట్టేవారు. నేను వారిని బతిమాలి ఒక్క వారం రోజులు ఇక్కడ ఉంచండి తర్వాత వెళ్ళిపోతాము అని చెప్తే, సరేనని, ఒప్పుకున్నారు. అలా ఏడు రోజులు పూర్తి చేసి ఎనిమిదో రోజు మధ్యాహ్నం ఏం జరుగుతుందా అని ఎదురు చూస్తున్నాను. సరిగ్గా 12 గంటల సమయంలో రాజీని బాత్రూంకి తీసుకెళ్లవలసి వచ్చింది. తనని చక్రాల కుర్చీలో

కూర్చోబెట్టి, అక్కడదాకా వెళ్ళాక, నన్ను నర్స్ ఎందుకో పిలిస్తే, తనని అక్కడ వదిలి నేను వెనక్కి వచ్చి, మందులు అవీ చూపించి ఏదో మాట్లాడుతూ ఉండిపోయాను. కొంతసేపయ్యాక, హఠాత్తుగా గుర్తుకొచ్చింది రాజీని బాత్రూం దగ్గర వదిలేసి వచ్చానని. నా సహాయం లేనిదే తను నిలబడలేదు.అయ్యో అక్కడే నాకోసం ఎదురుచూస్తోందని తొందరగా వెడదామని అనుకుంటుండగా, నెమ్మదిగా రాజీ, గోడలు మంచాలు పట్టుకుని నడుస్తూ రావడం చూశాను. ఒక్కసారి దిగ్భ్రాంతి చెంది అలాగే చూస్తున్నాను. నెమ్మదిగా నడుచుకుంటూవస్తూ, మంచం దగ్గరకు వచ్చేసరికి ఏమి పట్టుకోకుండా నడిచేసింది. ఇదంతా చూసిన మా వార్డులో వాళ్ళందరూ పెద్దగా చప్పట్లు కొట్టారు. అనుకోకుండా నేను గోడ గడియారం వైపు చూస్తే 12 గంటల 15 నిమిషాలు అయింది. వెంటనే సమర్థ సద్గురు సాయినాథులు నాకు ఇచ్చిన మాట గుర్తుకొచ్చింది. అప్రయత్నంగా చేతులూ జోడించి హృదయపూర్వకంగా నమస్కరించుకున్నాను. అక్కడ వారందరికీ ఇదొక పెద్ద అద్భుతం. వైద్యులు కూడా ఆశ్చర్యపోయారు. ఇదేవైద్యం ఇంటి దగ్గర కొనసాగించమని తప్పకుండా నయమవుతుందని చెప్పారు. దాదాపు ఏడాదిన్నర ఇంటిదగ్గర నేనే రోజూ తనకి పంచకర్మ వైద్యం చేసేదాన్ని. అప్పటికి తను పూర్తిగా కోలుకుంది. అప్పుడు ఇదివరకు వెళ్లిన ఆసుపత్రికి కాకుండా, బళ్లారిలో ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయిస్తే, "ఈ అమ్మాయి చాలా చక్కగా కోలుకుంది, ఇప్పుడు హాయిగా పెళ్లి చేసుకుని పిల్లల్ని కూడా కనొచ్చు" అని చెప్పారు. ఇలా శ్రీ బాబాగారు రెండోసారి మా ఇంట్లో వాళ్లకి ప్రాణ భిక్ష పెట్టారు. ఇప్పుడు తను పుట్టపర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సు గా ఉద్యోగం చేస్తోంది.

ఇక ముచ్చటగా మూడో విషయం నాకు సంబంధించినది. నేను అనారోగ్యానికి గురయ్యే వారం ముందు, ఒక స్వప్నం వచ్చింది. అందులో,,, బాబాగారితో, నాకు బాగా నడుము నొప్పిగా ఉందని చెప్తున్నాను. బాబా వెంటనే నా వెన్నుపూస పట్టుకొని, "అరెరే, నీకు వెన్నుపూసలో L4, L5, జారిపోయాయి జాగ్రత్త" అన్నారు. మెలకువ వచ్చాక నాకు కొద్దిగా భయమేసింది. అయితే ఒక వారం తర్వాత మా పెద్దక్క వాళ్ళ ఇంటికి వెళ్లాను.

అక్కడ హఠాత్తుగా నాకు జ్వరం వచ్చి వాంతులు అయ్యి, విపరీతంగా నడుము నొప్పి వచ్చింది. మా అక్క వాళ్ళది గుంతకల్లు. అక్కడ ఆసుపత్రికి వెడితే, వెంటనే అనంతపురం వెళ్ళమన్నారు. అలా వెళ్తున్న సమయంలో అకస్మాత్తుగా నాకు కంటి చూపు కూడా పోయింది. వెంటనే నన్ను అనంతపురం ఆసుపత్రిలో చేర్చారు. మా వాళ్ళందరూ వచ్చి,' మా అందరికీ ఎన్నో సేవలు చేశావు, నీకు ఇలా రావడం ఏమిటని ఏడుస్తున్నారు. వెంటనే నేను మా రాజీ తో, "నువ్వు ఈ ఊరిలో బాబా గుడికి వెళ్ళి, ధుని లో టెంకాయ వేసి, ప్రదక్షిణలు చేసి, 11రూపాయలు దక్షిణ సమర్పించి రమ్మని' చెప్పాను. అక్కడి వైద్యులు నాకు టాబ్లెట్స్ ఇంజక్షన్ ఇచ్చారు. రెండు రోజుల తరవాత, ఎక్కువ విశ్రాంతి తీసుకోమ్మని, ఇంటికి పంపించేశారు. మళ్ళీ నేను కూడా సంవత్సరాల తరబడి మంచంలో వుండాలేమో అనుకున్నాను. ఆ సందర్భంలో ఒక రోజు బాబా కలలో కనిపించారు కానీ ఏమీ చెప్పలేదు. నాకు విపరీతమైన ధైర్యం వచ్చింది. తర్వాత బాబా దయవల్ల తొందరగానే కోలుకున్నాను. ఇప్పుడు నాకు వివాహం అయ్యి ఒక పాప కూడా ఉంది.

ఇక్కడ మరొక ముఖ్య విషయం చెప్పాలి. బాబాగారు నాకు తరచుగా స్వప్నంలో కనిపించి, "నిన్ను శివపార్వతుల దగ్గరికి పంపిస్తాను" అనేవారు. అప్పుడు నేను, "నన్ను ఎక్కడికీ పంపించవద్దు. నన్ను మీదగ్గరే వుంచండి. నాకు మీరే కావాలి" అని చెప్పేదాన్ని. నేను పూజ్యశ్రీ మాస్టరుగారు రచించిన సాయి లీలామృతమే పారాయణ చేసేదాన్ని. పూజ్యశ్రీ అమ్మగారిని కూడా నాగోలులో దర్శించుకోవడం జరిగింది. అప్పుడప్పుడూ నాగోలు వెళ్లి వస్తుండేవాళ్ళం. అక్కలిద్దరికీ, నాకు మాత్రమే కాక; మా తమ్ముడికి, అమ్మకి, నాన్నకి కూడా ఆరోగ్య సమస్యలు వచ్చాయి. అంతే కాకుండా మా కుటుంబాన్ని ఆర్థిక సమస్యలు కూడా చుట్టుముట్టాయి. అటువంటి పరిస్థితిలో పూజ్యశ్రీ అమ్మగారు నాగోలులో మాకు ఆశ్రయం ఇచ్చి మమ్మల్ని ఆదుకున్నారు. ఇప్పుడు అందరం జీవితంలో స్థిరపడి పెళ్లిళ్లు చేసుకుని పిల్లలతో చక్కగా హాయిగా వున్నాము.

మేము నాగోలు చేరుకున్నాక, ఒక్కసారి కూడా శ్రీ సాయినాథులవారు స్వప్న దర్శనం యివ్వలేదు. 'నిన్ను శివపార్వతుల దగ్గరకి పంపిస్తాను' అని బాబాగారు అన్నమాటలకు అర్థం అప్పుడు నాకు తెలిసింది! మా తరువాతి జీవితమంతా శివ పార్వతుల స్వరూపులు, ఆది దంపతులు అయిన పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగారు తీర్చిదిద్దారు. వారికి మా కుటుంబమందరి తరపున శత సహస్ర కోటి పాదాభి వందనములు.●

# ఆచార్యుని అద్భుత లీలలు

**శ్రీమతి రాజేశ్వరి, కడప**

కడప వాస్తవ్యులు శ్రీమతి రాజేశ్వరిగారు పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవులతో వారికి గల అనుభవాలను అనుభూతులను ఈ విధంగా తెలియజేస్తున్నారు:

మావారు థామస్ రెడ్డి గారు. పూజ్యశ్రీ మాస్టరుగారంటే వారికి ఎనలేని భక్తి గౌరవాలు. మా వివాహమయ్యాక ఎక్కువగా పూజ్యశ్రీ మాస్టరుగారి గురించి చెప్తూ ఉండేవారు. మావారు క్రిస్టియన్ మతం తీసుకున్నారు. మా ఇంట్లో హిందు దేవతలని పూజించేవాళ్ళం. నా దృష్టిలో పూజ్యశ్రీ మాస్టరుగారంటే ఒక కళాశాల అధ్యాపకులు అన్న అభిప్రాయం వుండేది. పెళ్లయిన మూడు సంవత్సరముల వరకు మేమిద్దరం వేరే ఊర్లల్లో ఉద్యోగం చేయడం వల్ల పూర్తిగా దేనికీ సమయం కేటాయించటం వీలయ్యేది కాదు. తర్వాత ఇద్దరం కడపకి దగ్గరలోనే ముందు ప్రైవేట్ ఇనిస్టిట్యూట్లో తరవాత ప్రభుత్వ కళాశాలలో ఉపాధ్యాయులుగా చేరి తర్వాత అధ్యాపకులుగాను ప్రధాన అధ్యపకులుగా పని చేశాము.

మా పెళ్లి అయిన తర్వాత దాదాపు మూడు సంవత్సరాలకి ఒకసారి నేను, మావారు కలిసి 1984వ సంవత్సరంలో పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనానికి వెళ్ళాం. నేనైతే 'మావారు ఇంతగా అభిమానించే వ్యక్తిని చూడాలి' అని మాత్రమే వెళ్లాను. మేము గుమ్మంలోకి అడుగుపెడుతుండగానే, పూజ్యశ్రీ మాస్టరుగారు అమిత ఆనందంతో మా ఇద్దరిని ఆహ్వానించారు. వారింట్లోనే మేము మధ్యాహ్నం భోజనం చేశాము. భోజనాల తర్వాత మాతో పూజ్యశ్రీ మాస్టరుగారు మాట్లాడుతూ, నాకు శిరిడీ సాయిబాబా గురించి చెప్తున్నారు. నేను పూజ్యశ్రీ మాస్టరుగారితో "ఏమో సార్, నాకు వెంకటేశ్వర స్వామి, ఆంజనేయస్వామి అంటే ఇష్టం. నేను మరే యితర దేవుణ్ణి పూజించలేను" అని చెప్పాను. "ఇప్పుడు అలాగే అంటావులే, తర్వాత థామస్ రెడ్డి కన్నా బాబాకు నువ్వే పెద్ద భక్తురాలివి అయిపోతావ్" అన్నారు. అప్పుడు వెంటనే నేను, "అది మాత్రం జరగదు సార్, అసలు మా ఇద్దరి అభిప్రాయాలు ఇంతవరకు కలవలేదు. ఎవరి దారి వారిది లాగే వుంటుంది, అసలు ఎంత కాలం కలిసి వుంటామో కూడా నాకు అనుమానమే" అని చెప్పాను. "అదేం లేదమ్మా, మీరిద్దరూ కలకాలం ఆదర్శ దంపతులుగా వుంటారు" అన్నారు. "అయితే సార్ ఒక ప్రశ్న,, బాబాకి అన్నీ తెలుసని మీరు అంటారు కదా! మరి ఆయన నాలాంటి వ్యక్తిని భక్తుడైన అతనికి భార్యగా ఎందుకు ఎన్నుకున్నారు?" అని అడిగాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, "నీ జీవితంలో బాబా ప్రవేశించడానికి, థామస్ ని నీకు భర్తగా ఇచ్చాడు. బాబాతో నీకు జన్మ జన్మల సంబంధం ఉంది. ఈ జన్మలో నువ్వు మర్చిపోయిన కారణంగా అతని ద్వారా నీకు గుర్తుకు తెచ్చేందుకు అతనితో నీకు వివాహం అయింది. అందువల్ల మీరు విడిపోయే ప్రశ్నే లేదు" అన్నారు. అప్పుడు నేను చాలా ధైర్యంగా సవాలు విసిరినట్లు మాట్లాడుతూ, 'చూద్దాంలేండి మాస్టరు గారు' అని చెప్పి ఇంటికి వచ్చాను.

ఇంటికి వచ్చిన దగ్గర నుండి నాకు తెలియకుండానే శ్రీ సాయిలీలామృతము, పూజ్యశ్రీ మాస్టరుగారు రాసిన ఇతర

గ్రంథాలు పారాయణ చెయ్యడం మొదలుపెట్టాను. స్కూలుకు వెళ్లడం, పిల్లల్ని చూసుకోవడం, దీంతోపాటు సమయం ఉంటే పూజ్యశ్రీ మాస్టరుగారి రచనలు చదవడం – ఇదే నా జీవితం. నెమ్మది నెమ్మదిగా వారేమిటో అర్థమవ్వసాగింది. నేను, మావారు కలిసి చాలాసార్లు మాస్టరుగారి దగ్గరికి వెళ్లేవాళ్ళం. మేము ఒక ఆరు సంవత్సరములు మైలవరం డ్యాం దగ్గర స్కూల్లో ఉద్యోగం చేసాము. మమ్మల్ని అక్కడ ఉన్న బాబా గుడిలో సత్సంగాలు చెయ్యమన్నారు. తరవాత కొంతకాలానికి పూజ్యశ్రీ మాస్టరుగారు 'సాయి సన్నిధి' గ్రంథం ఆవిష్కరణ నిమిత్తం అక్కడికి రావడం జరిగింది. మొట్టమొదటిసారి మాస్టరుగారిని ఆహ్వానించుకున్నాము. మేము మైలవరం డ్యామ్ క్వార్టర్స్ లో వుండేవాళ్ళం. పూజ్యశ్రీ మాస్టరుగారికి ఒక క్వార్టర్ లో విడిది ఏర్పాటుచేసాము. కార్యక్రమం పూర్తయ్యాక పూజ్యశ్రీ మాస్టరుగారు కారులో క్వార్టర్స్ కు వెళ్తున్నారు. నేను మా చిన్న పాపను ఎత్తుకొని నిలుచుని ఉన్నాను. మాస్టరుగారు కారులోంచి 'అమ్మాయ్' అని పిలిచి కారు ఎక్కమన్నారు. వారితో పాటు మా క్వార్టర్స్ కి వెళ్లిపోయాము. 'అమ్మాయి' అన్న వారి పిలుపు ఎంతో ఆప్యాయంగా వుండేది. వారి సన్నిధి, వారి మాటలు ఎంతో ఆనందాన్ని కలిగించేవి.

మా ఇంటికి వారిని ఆహ్వానించుకున్నాము, కానీ ఏ విధంగా సేవించుకోవాలో తెలియదు. వారితో కూడా వచ్చినవారు పాదపూజ చేసుకొమ్మన్నారు. అప్పుడు వారి పాదాలను కడిగి నమస్కారం చేసుకున్నాము. తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారు మా ఇంట్లో పూజలో వున్న ఫోటోలకి హారతి యిచ్చారు. పూజలో నేను పూజ్యశ్రీ మాస్టరుగారిది పెద్దపటం పెట్టుకున్నాను. అది చూసి వారేమంటారోనని భయపడ్డాను. కానీ ఏమీ అనలేదు. తరవాత అక్కడకొచ్చిన వాళ్ళందరూ పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కారం చేసుకుంటున్నారు. నేను వారి పక్కనే నిలబడి వున్నాను. అప్పుడు నా వైపు చూసి, "ఏమ్మా, ఏమిటి ఆలోచిస్తున్నావ్" అని అడిగారు. మాకు ముగ్గురు ఆడపిల్లలు కదా, అంతంత మాత్రం సంపాదన, వీళ్ళ భవిష్యత్తు ఎలా వుంటుందోనని ఆలోచిస్తున్నాను' అన్నాను. "ఏమీ బెంగపడకమ్మా, వాళ్ళు చక్కగా వుంటారు. ఏదైనా అసరమైతే వారితో చెప్పుకో" అని ఎదురుగా ఉన్న బాబా పటంవైపు చూపించారు. నాకు కొండంత ధైర్యం వచ్చింది. తరవాత వారికిచ్చిన విడిదికి వెళ్లారు. మర్నాడు ఉదయం నేను, నాతో పాటూ పని చేసే నా స్నేహితురాళ్లు పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు వెళ్ళాం. అందరూ వారితో, తమ పిల్లల గురించి మాట్లాడుతున్నారు. సమస్యలు చెప్పుకుంటున్నారు. అప్పుడు నేను పూజ్యశ్రీ మాస్టరుగారిని ఒక ప్రశ్న అడిగాను. "ఇక్కడ సత్య సాయిబాబా స్కూలు ఉంది, నేను మా ముగ్గురు పిల్లల్ని అందులో చేర్చుదామని అనుకుంటున్నాను" అన్నాను. పూజ్యశ్రీ మాస్టరుగారు "ఎందుకు?" అని ప్రశ్నించారు. "ఆ స్కూల్లో చదివితే నైతిక విలువలు బాగుంటాయి" అని చెప్పాను. అప్పుడు వారు నాతో, "మీ ఇంట్లో లేని నైతిక విలువలు అక్కడ వుంటాయా?" అని అడిగారు. మిగతావారు ఇదే ప్రశ్న అడిగినప్పుడు వారి పిల్లల్ని అందులో చేర్చమని చెప్పారు. అయినా తర్వాత, నేను మా పిల్లల చేత ఆ స్కూల్లో చేరడానికి అవసరమైన ప్రవేశ పరీక్ష రాయించాను. కానీ మా పిల్లలు ఎవ్వరూ అర్హత పొందలేదు. మిగతా పిల్లలందరూ ఉత్తీర్ణులై ఆ పాఠశాలలో చేరారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి అయిన రోజు మధ్యాహ్నం మేము స్కూలు నుంచి భోజనానికి ఇంటికి వచ్చాము. ఆ సమయంలో మాకు తెలిసిన ఒక కుర్రవాడు మా ఇంటికి వచ్చి "మీరు పూజించుకునే మాస్టరుగారు సమాధి అయ్యారు" అని చెప్పాడు. 'సరిగ్గా విన్నావా పేరు?' అని అడిగితే, భరద్వాజగారు అని చెప్పాడు. నేను అతన్ని చడామడా మందలించాను. "ఇంకెవరో భరద్వాజ అయి ఉంటారు, వారు మాత్రం కాదు. తెలిసీ తెలియకుండా మాట్లాడొద్దు", అని చాలా మాటలన్నాను. అప్పుడు 'కాదమ్మా, వారు చాలా గ్రంథాలు రచించారని, బాబా భక్తులని, ఎక్కిరాల భరద్వాజగారని ఇంటిపేరుతో సహా చెప్పారు' అనగానే, మావారు ఒంగోలు కి ఫోన్ చేశారు. అది నిజమే అని తెలుసుకున్న తర్వాత, ఇద్దరం బయలుదేరి వెళ్లాం. దాదాపు మర్నాడు తెల్లవారుఝాము సమయానికి చేరుకున్నాము. మావారు పూజ్యశ్రీ మాస్టరు గారి పాదాలు పట్టుకుని గట్టిగా ఏడ్చారు. నేను కొద్దిగా నిగ్రహించుకున్నాను కానీ, తీరా మాస్టరుగారిని తీసుకువెళ్లే సమయానికి నేను కూడా గట్టిగా ఏడ్చాను. నాతో పాటు చాలామంది విపరీతంగా రోదించారు. అంతటి ప్రేమమూర్తిని, కరుణామయుని ఎప్పటికీ పొందలేమన్న విపరీతమైన ఆవేదన అందరిలో చోటు చేసుకుంది.

పూజశ్రీ మాస్టరుగారి సమాధి అనంతరం నాకు వారి మీద విపరీతమైన భక్తి భావం పెంపొందింది. నాకు వేరే

ఎవరితో పనిలేదు. స్కూలు, పిల్లల్ని చూసుకోవడం, నాలుగు హారతులు చేసుకోవడం, మిగిలిన సమయం మాస్టరుగారి గ్రంథాలు పారాయణ చేసుకోవడం, వారు సూచించిన వారి జీవిత చరిత్రల పారాయణ ,,, ఇంతే! ఇక వేరే ఆలోచన ఉండేది కాదు. పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లు, మా ఆడపిల్లలు ముగ్గురు వివాహాలు చేసుకుని, ఉద్యోగాలు చేసుకుంటూ, జీవితంలో స్థిరపడ్డారు. అయితే ప్రతి అమ్మాయి వివాహానికి, సంబంధం కుదిరే ముందు నేను 'పరిప్రశ్న' గ్రంథం తీసి చూసి దానిలో వచ్చే సమాధానాన్ని బట్టి వారి వివాహాలు నిర్ణయించాను. అంటే నా ఉద్దేశం సశరీరంగా పూజ్యశ్రీ మాస్టరుగారు లేకపోయినా, ఆ గ్రంథం రూపంలో నాకు సమాధానం చెప్తారని విపరీతమైన నమ్మకం ఉండేది. ఆ విధంగానే వారు కూడా నా పిల్లలందరికీ చక్కటి జీవితాన్ని ప్రసాదించారు.

ఇప్పుడు మేమిరువురము ఉద్యోగ విరమణ అనంతరం వారి గ్రంథాల పారాయణ, నామ స్మరణ, వారితో గడిపిన క్షణాల మధుర స్మృతులతో కాలం గడుపుతున్నాం. ఇంతమంది మహాత్ములు, దేవుళ్ళు వున్నా, మా మనసుల్లో పూజ్యశ్రీ మాస్టరుగారికే అగ్రతాంబూలం. వారి తరువాతే ఎవరైనా. మా జీవితాలు ఎందుకు కలిసాయో మాకు బోధించి మమ్మల్ని సన్మార్గంలో నడిపించిన మా గురుదేవులకు హృదయపూర్వక

నమస్సుమాంజలులు!!

# మాతృదేవి స్మృతులు

17వ పేజీ తరువాయి

కొత్త గిన్నెలో తీసుకొని సరిగ్గా నివేదన సమయానికి మాకు అందజేశారు!! ఇక మా ఆనందానికి అవధులు లేవు. పూజ్యశ్రీ అమ్మగారి లీలకు అబ్బురపడుతూ సంతోషంగా నైవేద్యం సమర్పించుకున్నాము.

ఇంకొకసారి సేవకు వెళ్ళినప్పుడు నా కుడి చేతి భుజం దగ్గర చాలా నొప్పిగా వుంది. అయినా ఊడవడం, కడగడం... ఇవన్నీ చేయి మార్చుకుంటూ చేసుకునేదాన్ని. పూజ్యశ్రీ అమ్మగారికి మంగళస్నానం చేయించేటప్పుడు కుడి చేత్తోనే నీళ్లు పోయవలసి వచ్చేది. ఆశ్చర్యం!!! నేను తిరిగి బయలుదేరే సమయానికి నాకు తెలియకుండానే నా కుడి భుజం నొప్పి పూర్తిగా తగ్గిపోయింది!! ఇలాంటి అనుభవాలు ఎన్నో ఎన్నెన్నో!

అలివేలు మంగమ్మ తల్లి సన్నిధి, సేవ మనకు దొరకడం పూర్వజన్మ సుకృతం. ఇంతటి సన్నిధిని నేను, నాతో పాటు మన సత్సంగసభ్యులందరూ చక్కగా ఉపయోగించుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలి సమర్పిస్తున్నాను.

జై సాయి మాస్టర్!

# మాతృదేవి సన్నిధిలో బ్రహ్మానుభూతి మహోత్సవము!

23వ పేజీ తరువాయి

మనకు వుందా? లేదా? ఉంది అనిపిస్తే ధైర్యంగా ధర్మంగా కొనసాగిస్తూ పోవాలి. లేదేమో అనిపిస్తే వారి అనుగ్రహం పొందాలంటే ఏం చేయాలో అది చేయాలి. ఇంతటితో ఆధ్యాత్మికత సంపూర్ణమవుతుంది. నిజాయితీతో మాస్టరుగారి లాగా తన జీవితానికి తానే సమాధానం అని అర్థం చేసుకొని దానికోసం హృదయపూర్వకంగా ప్రయత్నించేవాడు నిజమైన శిష్యుడు. శిరిడి సాయి లాగా ఎటువంటి అర్హతలతో సంబంధం లేక ఉద్ధరించగలవాడే గురువు. అసలైన ఆధ్యాత్మికతను బోధించిన అసమాన గురుశిష్యులు సమర్థ సద్గురువు శిరిడీ సాయినాథుల వారికి, పూజ్యశ్రీ మాస్టరుగారికి శతసహస్ర కోటి నమస్కారములు....... సమర్పిస్తూ తన సత్సంగాన్ని ముగించారు.

అనంతరం గురుపుత్రులు సతీసమేతంగా మనందరి తరపున విశేషపూజ చేసి మనందరికీ ఈ విధమైన చక్కటి ఒక సూచన చేసారు. అందరూ పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కారం చేసుకునేటప్పుడు, "ఎప్పుడూ మాకు తోడుగా వుండి, ఎలాగైతే సాయినాథులవారు వారి శిష్యులైన మాస్టరుగారిని నడిపారో, అదే సాంప్రదాయాన్ని అనుసరించి మమ్మల్ని కూడా నడపమని ప్రార్థన చేసుకోండి" అని చెప్తూ ,,,పర్వదినాలలో మహాత్ముల సన్నిధిలో ప్రభావం ఎక్కువగా వుంటుంది కనుక మిగిలిన సమయాన్ని గ్రంథ పఠన, నామ స్మరణతో సద్వినియోగం చేసుకొమ్మని, బ్రహ్మానుభూతి కార్యక్రమాలను ముగించారు.●

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే
# రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి (రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ (రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత - తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ (రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2 (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి (సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

### BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master *(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |



'శ్రీ అలివేలు మంగమ్మ దివ్య సన్నిధానము' గుమ్మళంపాడు లో ఫిబ్రవరి 9వ తేదీన పూజ్య భరద్వాజ గురుదేవుల బ్రహ్మైనుభూతి పర్వదినము సందర్భంగా గురు పుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు సత్సంగములో చక్కటి విషయాలు ప్రసంగించి అనంతరం విశేష పూజ గావించారు. భక్తులందరూ ఆనందోత్సాహాలతో, భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.**
**Printed and published by Dr. R.S. Sasidhar on behalf of E. Vikramaditya and printed at Vanaja Printers, Vijayawada and published at Sri Manga Bharadwaja Trust, Ongole (523002) - Editor: Dr. R.S. Sasidhar.**
**Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.**



# లీలా కళ్యాణ స్వర్ణోత్సవ వేడుకలు

## 04 - 09, మార్చి 2025

*కళ్యాణము చూడరారండి! । పరమేశ్వరుని।*
*కళ్యాణము చూడరారండి! ॥*
*విన్నవారికి కన్నవారికి ఇహపరంబులనొసగునట్టి ।*
*మంగళప్రదమౌ అలమేల్ మంగాంబాభరద్వాజుల ॥*
*కళ్యాణము చూడరారండి! ।*

**మన గురుదంపతుల కళ్యాణ మహోత్సవము జరిగి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వారి కళ్యాణ మహోత్సవ స్వర్ణోత్సవ వేడుకలు 'శ్రీ అలివేలుమంగమ్మ దివ్యసన్నిధానము' లో విశేష కార్యక్రమములతో మార్చి 5వ తేదీ నుంచి ౯వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ కార్యక్రమాలలో భక్తులందరూ పాల్గొని గురుదంపతుల కృపాశీస్సులు పొందవలసిందిగా ప్రార్థన!**